SAMAYAM

epaper.samayamdaily.net APTEL/26/A3949

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక | తెలుగు దినపత్రిక

సమయం

విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.

7036644111, 9490140565

సంపుటి: 1 | సంచిక: 105 | ఎడిటర్ : అలీ ముర్తుజా | మంగళవారం 27 అక్టోబర్ 2026 | ప్రచురణ : విజయవాడ | పేజీలు: 8 | వెల: రూ.5 |

## పోలీస్ స్టేషన్ ఎదుట ప్రభాకర్‌రెడ్డి బైఠాయింపు

- టీడీపీ కార్యకర్తలపై దాడులను అడ్డుకోవడంలో పోలీసులు విఫలమయ్యారని ఆరోపణ
- అర్ధరాత్రి వరకు తాడిపత్రి రూరల్ పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన
- తిమ్మంపల్లి, కొడవండ్లపల్లిలో దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్
- నచ్చజెప్పిన పోలీసులు.. నిరసన విరమించిన జేసీ
- పోలీసులు టీడీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని వైసీపీ నేత తోపుదుర్తి విమర్శ

2



## నేడు, రేపు పులివెందులలో జగన్ పర్యటన

- భాకరాపురం క్యాంపు ఆఫీసులో ప్రజలకు అందుబాటు
- రాత్రికి అక్కడే బస చేసి, బుధవారం తిరిగి తాడేపల్లికి పయనం

.. వివరాలు 2లో





# తీవ్ర తుపానుగా అర్నబ్!

బంగాళాఖాతంలో ఏర్పడిన 'అర్నబ్' తుపాను వేగంగా తీరం దిశగా దూసుకొస్తోంది. ఇది అర్ధరాత్రికి తీవ్ర తుపానుగా, మంగళవారం నాటికి అతి తీవ్ర తుపానుగా రూపాంతరం చెందుతుందని వాతావరణ శాఖ వెల్లడించింది. బుధవారం ఉదయం బాపట్ల-విశాఖపట్నం మధ్య యానాం సమీపంలో ఇది తీరం దాటే అవకాశం ఉందని విపత్తు నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. తీరం దాటే సమయంలో గరిష్ఠంగా గంటకు 140 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. ఈ తుపాను ప్రభావంతో మంగళ, బుధవారాల్లో కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉనట్లు అధికారులు స్పష్టం చేశారు.

- నేడు అతి తీవ్ర తుపానుగా మారే అవకాశం..
- 28న బాపట్ల-విశాఖ మధ్య తీరం దాటే సూచన
- గరిష్ఠంగా 140 కి.మీ. వేగంతో గాలులు..
- అప్రమత్తమైన యంత్రాంగం..
- పలు జిల్లాల్లో విద్యాసంస్థలకు సెలవులు

**అమరావతి, అక్టోబర్ 26:** బంగాళాఖాతంలో ఏర్పడిన 'అర్నబ్' తుపాను ఆంధ్రప్రదేశ్ తీరం వైపు దూసుకొస్తోంది. సోమవారం అర్ధరాత్రికి తీవ్ర తుపానుగా, మంగళవారం నాటికి అతి తీవ్ర తుపానుగా బలపడే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. బుధవారం ఉదయం బాపట్ల-విశాఖపట్నం మధ్య, యానాం సమీపంలో తీరం దాటే అవకాశం ఉందని అంచనా వేసింది. తీరం దాటే సమయంలో గంటకు 115-125 కి.మీ. వేగంతో గాలులు వీచే అవకాశం

మిగతా 2 లో

## అప్రమత్తంగా ఉండండి

- ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోండి
- లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించండి
- ప్రతి నాలుగు గంటలకోసారి తుపాను హెచ్చరికలు..
- పరిస్థితిపై గంటగంటకూ సీఎం చంద్రబాబు సమీక్ష

2



బంగాళాఖాతంలో ఏర్పడిన ఆర్నబ్ తుఫాన్ నేపథ్యంలో రాష్ట్ర యంత్రాంగం అప్రమత్తం కావాలని సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. క్యాంపు కార్యాలయం నుంచి ఉన్నతాధికారులు, ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో ఆయన వర్చువల్‌గా ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. రేపటికల్లా ఇది తీవ్ర తుపానుగా మారి రాష్ట్రంపై ప్రభావం చూపే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం హెచ్చరించినందున, తీరప్రాంత జిల్లాల కలెక్టర్లు తక్షణమే ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. భారత వాతావరణ విభాగం హెచ్చరికల రీత్యా ఆయా తీరప్రాంత జిల్లాల కలెక్టర్లు ముందస్తు చర్యలు చేపట్టాలని సీఎం దిశానిర్దేశం చేశారు.

## స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలి

- స్థానిక సంస్థల ఎన్నికలను సీరియస్‌గా తీసుకోవాలని నేతలకు చంద్రబాబు సూచన
- 'చెప్పాం-చేస్తున్నాం' నినాదంతో ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపు

2



4

## ఆ మాట మోదీతో చెప్పండి

- 30 సెకన్లలో నిరసనలు ఆగిపోతాయి
- వ్యాపారులకు రాహుల్ సూచన
- 'ఓటు చోరీ'కి వ్యతిరేకంగా నవంబరు 1న 'ఇండియా' కూటమి ఆందోళన

## జామియా విద్యార్థుల దీక్షకు పాక్షికంగా తెర

- విద్యార్థి సంఘం ఎన్నికలకు యూనివర్సిటీ అంగీకారం
- సస్పెన్షన్లు, షోకాజ్ నోటీసుల ఉపసంహరణకు నిర్ణయం

4

## తిరుమలలో వైభవంగా పౌర్ణమి గరుడసేవ

### వాహన సేవలో పాల్గొన్న భారత ఉపరాష్ట్రపతి



తిరుమలలో సోమవారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించిన పౌర్ణమి గరుడసేవలో భారత ఉపరాష్ట్రపతి సీ.పీ.రాధాకృష్ణన్ పాల్గొన్నారు. కాగా రాత్రి 7 నుండి 9 గంటల వరకు సర్వాలంకార భూషితుడైన శ్రీ మలయప్ప స్వామివారు గరుడునిపై ఆలయ మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. పౌరాణిక నేపథ్యంలో 108 వైష్ణవ దివ్యదేశాలలోనూ గరుడసేవ అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకుంది.

2



## ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ నుంచి నోబెల్ విజేతలు రావాలి

- వర్సిటీ 40వ వార్షికోత్సవంలో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్
- విద్యా, వైద్య రంగాలకు ఎన్టీఆర్ చేసిన సేవలు ప్రశంసనీయం
- క్యాన్సర్ వంటి వ్యాధులపై పరిశోధనలకు విద్యార్థులు ప్రాధాన్యమివ్వాలి
- ఆధునిక సాంకేతికతతో పాటు వైద్యుల్లో మానవత్వం అవసరం
- మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించాలని పిలుపు

3



## బలవంతపు ఏకగ్రీవాలతో ప్రజాస్వామ్యానికి తూట్లు

- ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల
- స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో కూటమి అరాచకాలకు పాల్పడిందని ఆరోపణ
- 16 మున్సిపాలిటీలు, 639 వార్డులు, 4 జెడ్పీటీసీ, 32 ఎంపీటీసీ స్థానాల ఏకగ్రీవాలపై అభ్యంతరం
- ప్రతిపక్ష అభ్యర్థులను బెదిరించి, నామినేషన్ పత్రాలు చించివేశారని విమర్శ

3

స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో నమోదైన ఏకగ్రీవాలపై ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శలు చేశారు. ఇవి ప్రజల ఆమోదంతో వచ్చిన ఫలితాలు కాదని, అధికార బలంతో కూటమి పార్టీలు సాధించినవని ఆరోపించారు. ఈ ఏకగ్రీవాలు ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించేలా ఉన్నాయని మండిపడ్డారు.

## ఢిల్లీలో నార్త్ బ్లాక్‌లో అగ్నిప్రమాదం



- రాష్ట్రపతి భవన్ సమీపంలో చెలరేగిన మంటలు
- దట్టమైన పొగలు వ్యాపించడంతో అప్రమత్తమైన అధికారులు

4

## ఖర్గే వ్యాఖ్యల దుమారం

### దేశవ్యాప్తంగా బీజేపీ శ్రేణుల నిరసనలు!

4

- ప్రధాని మోదీపై వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో భగ్గుమన్న కమలనాథులు
- కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాజీనామా చేయాలని, క్షమాపణ చెప్పాలని కమలదళం డిమాండ్





# పోలీస్ స్టేషన్ ఎదుట జేసీ ప్రభాకర్‌రెడ్డి బైఠాయింపు

**టీడీపీ కార్యకర్తలపై దాడులను అడ్డుకోవడంలో పోలీసులు విఫలమయ్యారని ఆరోపణ**

**అర్ధరాత్రి వరకు తాడిపత్రి రూరల్ పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన**

**అనంతపురం, అక్టోబర్ 26 :** స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో టీడీపీ కార్యకర్తలపై జరుగుతున్న దాడులను పోలీసులు అరికట్టడం లేదని ఆరోపిస్తూ తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి నిరసనకు దిగారు. తన అనుచరులతో కలిసి అర్ధరాత్రి వరకు తాడిపత్రి రూరల్ పోలీస్ స్టేషన్ ఎదుట మంచం వేసుకుని బైఠాయించారు. ఈ పరిణామంతో తాడిపత్రిలో ఉద్రిక్తత నెలకొంది. శింగనమల నియోజకవర్గం యల్లనూరు మండలంలోని తిమ్మంపల్లి, కొడవండ్లపల్లి గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి నాయకత్వంలో వైసీపీ కార్యకర్తలు టీడీపీ శ్రేణులపై దాడులకు పాల్పడ్డారని జేసీ ఆరోపించారు. ఘటనలకు బాధ్యులైన వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జేసీ బైఠాయింపుతో అప్రమత్తమైన పోలీసులు ఆయనతో చర్చలు జరిపి నచ్చజెప్పారు. దీంతో ఆయన నిరసనను విరమించి అక్కడి నుంచి వెళ్లిపోయారు. మరోవైపు రాప్తాడు వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి జిల్లా పోలీసులపై విమర్శలు చేశారు. పోలీసులు టీడీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని, వారి పనితీరు సరిగా లేదని ఆరోపించారు.

# నేడు, రేపు పులివెందులలో జగన్ పర్యటన

**భాకరాపురం క్యాంపు కార్యాలయంలో ప్రజలకు అందుబాటు**

**రాత్రికి అక్కడే బస చేసి, బుధవారం తిరిగి తాడేపల్లికి పయనం**



**తాడేపల్లి, అక్టోబర్ 26 :** వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ తన సొంత నియోజకవర్గమైన పులివెందులలో రెండు రోజుల పాటు పర్యటించనున్నారు. ఈ నెల 27, 28 తేదీల్లో (మంగళ, బుధవారాల్లో) ఆయన పర్యటన ఖరారైంది. ఈ సందర్భంగా రేపు, ఎల్లుండి ఆయన స్థానిక ప్రజలకు అందుబాటులో ఉండనున్నారు. పర్యటన షెడ్యూల్ ప్రకారం, జగన్ మంగళవారం (27వ తేదీ) ఉదయం 10:30 గంటలకు తాడేపల్లి నుంచి బయలుదేరి పులివెందులకు చేరుకుంటారు. అనంతరం భాకరాపురంలోని తన క్యాంపు కార్యాలయానికి వెళ్లి, అక్కడ ప్రజలను కలుసుకుంటారు. వారి సమస్యలు, వినతులను స్వీకరించేందుకు అందుబాటులో ఉంటారు. ఆ రోజు రాత్రికి పులివెందులలోని తన నివాసంలోనే బస చేస్తారు. రెండు రోజుల పర్యటన ముగించుకుని బుధవారం (28వ తేదీ) ఉదయం ఆయన పులివెందుల నుంచి తిరిగి తాడేపల్లిలోని తన నివాసానికి బయలుదేరి వెళ్లనున్నారు.

# స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలి

**స్థానిక సంస్థల ఎన్నికలను సీరియస్‌గా తీసుకోవాలని నేతలకు చంద్రబాబు సూచన**



**విజయవాడ, అక్టోబర్ 26 :** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పార్టీ నేతలు, కార్యకర్తలు పనిచేయాలని ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. పార్టీ ముఖ్య నేతలతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఎన్నికల సన్నద్ధతపై దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను 'చెప్పాం-చేస్తున్నాం' నినాదంతో ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు కూటమికి స్పష్టమైన తీర్పు ఇచ్చారని చంద్రబాబు పేర్కొన్నారు. ఇచ్చిన హామీల అమలుతో పాటు సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళుతున్నామని తెలిపారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేస్తూ సుపరిపాలన అందిస్తున్నామని, ఈ అంశాలను ప్రతి ఇంటికీ వివరించాలని నేతలకు సూచించారు. టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణుల మధ్య క్షేత్రస్థాయిలో సమన్వయం ఉండాలని చంద్రబాబు స్పష్టం చేశారు. కూటమి పార్టీల కార్యకర్తలు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులుగా పనిచేయాలని అన్నారు. కేంద్రం, రాష్ట్రం, స్థానిక స్థాయిల్లో సమన్వయంతో అభివృద్ధి సాధించే అవకాశాలను ప్రజలకు వివరించాలని సూచించారు. వార్డులు, డివిజన్లతో పాటు అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థుల గెలుపునకు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. పొత్తులు, రిజర్వేషన్లు, సామాజిక సమీకరణాల కారణంగా కొందరికి స్థానిక ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం రాకపోవచ్చని చంద్రబాబు పేర్కొన్నారు. పార్టీ, రాష్ట్రం కోసం కష్టపడిన నేతలకు తగిన గుర్తింపు ఉంటుందని, నామినేటెడ్ పదవుల ద్వారా అవకాశాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. బీసీలు, చిన్న కులాలకు ప్రాధాన్యం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అగ్రనేతల నుంచి క్షేత్రస్థాయి కార్యకర్తల వరకు అందరి పనితీరును నమోదు చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు ప్రతిపక్షం చేస్తున్న విమర్శలు, ప్రచారాన్ని వాస్తవాలతో తిప్పికొట్టాలని చంద్రబాబు సూచించారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో ప్రతిపక్ష వైఖరిని ప్రజలకు తెలియజేయాలని అన్నారు. ప్రతి ఓటరు పోలింగ్‌లో పాల్గొనేలా కృషి చేయాలని, 2024 ఎన్నికలతో పోలిస్తే ప్రతి పోలింగ్ బూత్‌లో ఓట్ల సంఖ్య పెరిగేలా ప్రణాళిక రూపొందించాలని నేతలకు దిశానిర్దేశం చేశారు

# అర్ధరాత్రికి తీవ్ర తుపానుగా అర్నబ్

(మొదటి పేజీ తరువాయి..)

ఉండగా, గరిష్ఠంగా 140 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీయవచ్చని హెచ్చరించింది. తుపాను ప్రభావంతో మంగళ, బుధవారాల్లో కోస్తాంధ్రలోని పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. కొన్ని ప్రాంతాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉండటంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. తీరప్రాంత ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, అధికారుల సూచనలను పాటించాలని వాతావరణ శాఖ సూచించింది.



**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

తుపాను నేపథ్యంలో చెట్లు, భారీ హోర్డింగ్‌లు, శిథిలావస్థలో ఉన్న భవనాల సమీపంలో ఉండొద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు. లోతట్టు, ముంపు ప్రాంతాల్లో నివసించే ప్రజలు అవసరమైతే ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచిస్తున్నారు. అత్యవసర సహాయక చర్యల కోసం ప్రభావిత జిల్లాల్లో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధం చేస్తున్నారు. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లొద్దని, ఇప్పటికే సముద్రంలో ఉన్నవారు తీరానికి చేరుకోవాలని అధికారులు హెచ్చరించారు. అత్యవసర పరిస్థితుల్లో అధికారికంగా ప్రకటించిన సహాయక నంబర్లను సంప్రదించాలని సూచించారు. తుపాను ప్రభావం ఉన్న సమయంలో అనవసర ప్రయాణాలను నివారించాలని, అవసరమైన ఆహారం, తాగునీరు, మందులను ముందుగానే సిద్ధం చేసుకోవాలని సూచిస్తున్నారు.

**తుపాను ప్రభావం.. పాఠశాలలకు సెలవులు**

'అర్నబ్' తుపాను ప్రభావం దృష్ట్యా ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో విద్యాసంస్థలకు అధికారులు సెలవులు ప్రకటిస్తున్నారు. విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని జిల్లాల వారీగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, కళాశాలలకు సెలవుల విషయంలో ఆయా జిల్లా కలెక్టర్లు, విద్యాశాఖ అధికారులు జారీ చేసే తాజా ఉత్తర్వులను తల్లిదండ్రులు గమనించాలని సూచిస్తున్నారు.

**కాకినాడలో ప్రత్యేక ఏర్పాట్లు**

తుపాను ముప్పును ఎదుర్కొనేందుకు కాకినాడ జిల్లాలో అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. తీరప్రాంత ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు పునరావాస కేంద్రాలను సిద్ధం చేస్తున్నారు. మత్స్యకారుల బోట్లను సురక్షిత ప్రాంతాలకు తరలించే చర్యలు కొనసాగుతున్నాయి. ఆసుపత్రులు, తాగునీటి సరఫరా వ్యవస్థలకు విద్యుత్ అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. రహదారులపై చెట్లు కూలితే తొలగించేందుకు ప్రత్యేక బృందాలను సిద్ధం చేస్తున్నారు. పెట్రోల్ బంకుల్లో తగినంత ఇంధన నిల్వలు ఉంచాలని సంబంధిత అధికారులకు సూచిస్తున్నారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తోంది. తుపాను కదలికలు, వర్షాలు, గాలుల తీవ్రతలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉన్నందున ప్రజలు ఐఎండీ, రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ, జిల్లా అధికారుల తాజా హెచ్చరికలను అనుసరించాలని అధికారులు సూచిస్తున్నారు.

# అప్రమత్తంగా ఉండండి

**ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోండి**

**లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించండి**

**ప్రతి 4 గంటలకోసారి తుపాను హెచ్చరికలు**

**పరిస్థితిపై గంటగంటకూ సీఎం సమీక్ష**



**అమరావతి, అక్టోబరు 26:** బంగాళాఖాతంలో ఏర్పడిన 'అర్నబ్' తుపాను నేపథ్యంలో రాష్ట్ర యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. తుపాను ప్రభావంతో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీ సుకోవాలని స్పష్టం చేశారు. క్యాంపు కార్యాలయం నుంచి ఉన్నతాధికారులు, కలెక్టర్లతో వర్చువల్‌గా సమీక్ష నిర్వహించారు. భారత వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో తీరప్రాంత జిల్లాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ నెల 28న తుపాను బాపట్ల-విశాఖపట్నం మధ్య యానాం సమీపంలో తీరం దాటే అవకాశం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. మంగళవారం మధ్యాహ్నం నుంచి శ్రీకాకుళం మొదలుకొని నెల్లూరు జిల్లా వరకు పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. తీరప్రాంతాల్లో బలమైన ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉందని వెల్లడించారు. ఈ నెల 28, 29 తేదీల్లో ఉత్తర కోస్తాంధ్ర జిల్లాలు, కోనసీమ, తూర్పు, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించారు. రాష్ట్రంలో చేపడుతున్న ముందస్తు చర్యలపై కేంద్ర ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని సీఎం ఆదేశించారు.

**లోతట్టు ప్రాంతాల ప్రజలను షెల్టర్లకు తరలించండి**

తుపాను ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని చంద్రబాబు ఆదేశించారు. వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణులు, చిన్నారులకు తరలింపులో తొలి ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా గుర్తించిన 4,711 మంది గర్భిణులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ఆసుపత్రులకు తరలించే ప్రక్రియ కొనసాగుతోందని అధికారులు తెలిపారు. ప్రభావిత జిల్లాల్లోని ఆరోగ్య కేంద్రాల్లో వైద్య బృందాలు, అంబులెన్సులను సిద్ధంగా ఉంచాలని సీఎం ఆదేశించారు. ఏడు ఎన్డీఆర్ఎఫ్, ఎనిమిది ఎస్డీఆర్ఎఫ్ బృందాలను 11 ప్రభావిత జిల్లాల్లో మోహరించాలని సూచించారు. ఎన్టీఆర్, విశాఖపట్నం జిల్లాల్లో అదనపు బలగాలను సిద్ధంగా ఉంచాలని నిర్దేశించారు. సహాయక చర్యల్లో మెరైన్ పోలీసులతో పాటు నౌకాదళం, కోస్టుగార్డు సేవలను వినియోగించుకోవాలని సూచించారు. సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారులను సురక్షితంగా తీరానికి చేర్చినట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. మొత్తం 30,043 పడవలు సురక్షితంగా హార్బర్లకు చేరుకున్నాయని తెలిపారు. తుపాను బలహీనపడి సముద్రంలో సాధారణ పరిస్థితులు నెలకొనేంత వరకు మత్స్యకారులు వేటకు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు.

**పంట నష్టం జరగకుండా చర్యలు**

తుపాను కారణంగా వ్యవసాయ, ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని చంద్రబాబు సూచించారు. కోసిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించేలా ఏర్పాట్లు చేయాలని వ్యవసాయ శాఖను ఆదేశించారు. సుమారు 1.82 లక్షల హెక్టార్లలోని ఉద్యాన పంటలకు ముప్పు పొంచి ఉన్నందున రైతులను అప్రమత్తం చేయాలని సూచించారు. రేషన్ దుకాణాల్లో నిత్యావసర సరుకులు అందుబాటులో ఉంచాలని, విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిన ప్రాంతాల్లో వెంటనే పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని అధికారులకు స్పష్టం చేశారు. తుపాను గమనాన్ని నిరంతరం అంచనా వేస్తూ ప్రతి నాలుగు గంటలకోసారి ప్రజలకు హెచ్చరికలతో కూడిన బులెటిన్ విడుదల చేయాలని ఆదేశించారు. గత తుపానుల అనుభవాలను విశ్లేషించి రైతులు, ప్రజలకు ఎప్పటికప్పుడు అవసరమైన సూచనలు అందించాలని తెలిపారు.

**రిజర్వాయర్లపై ప్రత్యేక దృష్టి**

తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున 22 రిజర్వాయర్ల పరిధిలోకి వరద ప్రవాహాలు వచ్చే అవకాశముందని అధికారులు అంచనా వేశారు. ఈ ప్రవాహాల ద్వారా 10 నుంచి 12 టీఎంసీల నీటిని నిల్వ చేసేలా ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. తాండవ, రైవాడ, ఏలేరు, తమ్మిలేరు, ఎర్రకాలువ, తాడిపూడి రిజర్వాయర్లలో నీటి నిల్వలు పెరిగే అవకాశముందని తెలిపారు. వాగులు, వంకలు, కాలువల్లో నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చూడాలని ఆదేశించారు. సామాజిక మాధ్యమాల్లో తుపానుపై తప్పుడు సమాచారం వ్యాప్తి చెందకుండా పర్యవేక్షించాలని, వదంతుల విషయంలో నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. తుపాను ప్రభావం ఎక్కువగా ఉండే ప్రాంతాలను గుర్తించి పరిస్థితులకు అనుగుణంగా విద్యాసంస్థలకు సెలవులపై నిర్ణయం తీసుకోవాలని తెలిపారు. తుపాను పరిస్థితులపై ముఖ్యమంత్రి గంటగంటకూ అధికారుల నుంచి సమాచారం తీసుకుంటున్నారు. ఈ సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, ఆర్టీజీఎస్, విపత్తు నిర్వహణ శాఖల అధికారులు, మంత్రి రామానాయుడు వర్చువల్‌గా పాల్గొన్నారు.

# తిరుమలలో వైభవంగా పౌర్ణమి గరుడసేవ

**వాహన సేవలో పాల్గొన్న భారత ఉపరాష్ట్రపతి**

**తిరుమల, అక్టోబర్ 26 :** తిరుమలలో సోమవారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించిన పౌర్ణమి గరుడసేవలో భారత ఉపరాష్ట్రపతి సీ.పీ.రాధాకృష్ణన్ పాల్గొన్నారు. కాగా రాత్రి 7 నుండి 9 గంటల వరకు సర్వాలంకార భూషితుడైన శ్రీ మలయప్ప స్వామివారు గరుడునిపై ఆలయ మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. పౌరాణిక నేపథ్యంలో 108 వైష్ణవ దివ్యదేశాలలోనూ గరుడసేవ అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకుంది. గరుడవాహనం ద్వారా స్వామివారు దాసానుదాస ప్రపత్తికి తాను దాసుడని తెలియజెబుతారు. అంతేగాక జ్ఞానవైరాగ్య ప్రాప్తికోరే మానవులు జ్ఞానవైరాగ్య రూపాలైన రెక్కలతో విహరించే గరుడుని దర్శిస్తే సర్వపాపాలు తొలగుతాయని భక్తకోటికి తెలియజెబుతున్నాడు. రాత్రి 7 నుండి 9 గంటల వరకు సర్వాలంకార భూషితుడైన శ్రీ మలయప్ప స్వామివారు గరుడునిపై ఆలయ మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. గరుడవాహనం ద్వారా స్వామివారు దాసానుదాస ప్రపత్తికి తాను దాసుడని తెలియజెబుతారు. అంతేగాక జ్ఞానవైరాగ్య ప్రాప్తికోరే మానవులు జ్ఞానవైరాగ్య రూపాలైన రెక్కలతో విహరించే గరుడుని దర్శిస్తే సర్వపాపాలు తొలగుతాయని భక్తకోటికి తెలియజెబుతున్నాడు పౌర్ణమి గరుడ సేవలో పాల్గొన్న



ఇతర ప్రముఖులలో జిల్లా ఇన్ ఛార్జ్ మంత్రి అనగాని సత్య ప్రసాద్, జిల్లా కలెక్టర్ డాక్టర్ వేంకటేశ్వర్, తిరుపతి ఎస్పీ సుబ్బారాయుడు, పలువురు బోర్డు సభ్యులు, ఇతర ఆలయ అధికారులు కూడా ఉన్నారు.

# ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ నుంచి నోబెల్ విజేతలు రావాలి

- వర్సిటీ 40వ వార్షికోత్సవంలో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ఆకాంక్ష
- విద్యా, వైద్య రంగాలకు ఎన్టీఆర్ చేసిన సేవలు ప్రశంసనీయం
- క్యాన్సర్ వంటి వ్యాధులపై పరిశోధనలకు విద్యార్థులు ప్రాధాన్యమివ్వాలి
- ఆధునిక సాంకేతికతతో పాటు వైద్యుల్లో మానవత్వం అవసరం
- మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించాలని పిలుపు



**విజయవాడ, అక్టోబర్ 26 :** డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ నుంచి భవిష్యత్తులో నోబెల్ బహుమతి గ్రహీతలు రావాలని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ఆకాంక్షించారు. వర్సిటీ 40వ వార్షికోత్సవం సందర్భంగా విజయవాడలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. వైద్య విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో పరిశోధనలు చేసి, ప్రాణాంతక వ్యాధులకు కొత్త చికిత్సా మార్గాలను కనుగొనాలని సూచించారు. విద్య, వైద్యం, సంక్షేమం, సాంస్కృతిక రంగాలతో పాటు తెలుగు భాష అభివృద్ధికి దివంగత ఎన్టీ రామారావు చేసిన కృషిని ఉపరాష్ట్రపతి కొనియాడారు. దేశంలోనే తొలి హెల్త్ యూనివర్సిటీని స్థాపించడం ఆయన దూరదృష్టికి నిదర్శనమన్నారు. తెలుగు గంగ ప్రాజెక్టు ద్వారా చెన్నై ప్రజలకు తాగునీరు అందించేందుకు ఎన్టీఆర్ చేసిన ప్రయత్నాలను ప్రస్తావిస్తూ, ఆయన మానవతా దృక్పథాన్ని గుర్తుచేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో వికసిత్ భారత్ 2047 లక్ష్యానికి అనుగుణంగా గత 12 ఏళ్లలో దేశంలో వైద్య కళాశాలలు, వైద్య విద్య సీట్ల సంఖ్య గణనీయంగా పెరిగిందని రాధాకృష్ణన్ తెలిపారు. క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు మెరుగైన పరిష్కారాలు కనుగొనే దిశగా విద్యార్థులు అంతర్జాతీయ పరిశోధనల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వైద్య రంగంలో కృత్రిమ మేధ, డిజిటల్ సాంకేతికత వినియోగం పెరుగుతున్నా రోగుల పట్ల కరుణ, ఆత్మీయత, మానవత్వాన్ని వైద్యులు విస్మరించకూడదని ఉపరాష్ట్రపతి స్పష్టం చేశారు. రోగులకు చికిత్స అందించడంలో మానవీయ దృక్పథమే కీలకమన్నారు. సమాజంలో మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు, వాటి దుష్ప్రభావాలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు వైద్యులు, యువత చొరవ తీసుకోవాలని సూచించారు.

# తిరుపతిలో డీజీపీల జాతీయ సదస్సు

- డిసెంబర్ 4 నుంచి 6 వరకు మూడు రోజుల పాటు సమావేశాలు
- హాజరుకానున్న ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా
- ఐఐఎస్ఈఆర్ ప్రాంగణంలో ఏర్పాట్లు
- భద్రత, వసతి, రవాణాపై సీఎస్ సాయిప్రసాద్ సమీక్ష



**అమరావతి, అక్టోబర్ 26 :** దేశ అంతర్గత భద్రత, శాంతిభద్రతలకు సంబంధించిన కీలక అంశాలపై చర్చించేందుకు నిర్వహించే డీజీపీల జాతీయ సదస్సుకు తిరుపతి వేదిక కానుంది. డిసెంబర్ 4 నుంచి 6వ తేదీ వరకు మూడు రోజుల పాటు తిరుపతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐఐఎస్ఈఆర్) ప్రాంగణంలో ఈ సమావేశాలు జరగనున్నాయి. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో పాటు అన్ని రాష్ట్రాల డీజీపీలు, ఐజీలు, కేంద్ర పోలీసు సంస్థల అధిపతులు పాల్గొననున్నారు. సదస్సు నిర్వహణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది. ఇందులో భాగంగా సోమవారం రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్ వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రధాని, కేంద్ర హోంమంత్రి, దేశవ్యాప్తంగా పోలీసు ఉన్నతాధికారులు హాజరవుతున్న నేపథ్యంలో భద్రత, వసతి, రవాణా ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శాఖల మధ్య సమన్వయంతో బాధ్యతలను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్, అదనపు డీజీపీ మధుసూదన్‌రెడ్డి, సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి జె. శ్యామలరావు, ఐపీఎస్ అధికారి కాంతి రాణా టాటా, ఎస్ఐబీ డిప్యూటీ డైరెక్టర్ అంబిక తదితరులు పాల్గొన్నారు. తిరుపతి కలెక్టర్ డా. వెంకటేశ్వర్, ఎస్పీతో పాటు ఇతర అధికారులు వర్చువల్‌గా సమావేశంలో పాల్గొని ఏర్పాట్లపై చర్చించారు.

# మేనకోడలి పెళ్లిని జగన్ అడ్డుకుంటున్నారు

- ఏపీ మంత్రి నారా లోకేశ్
- సొంత చెల్లి, మేనకోడలి విషయంలో భిన్నంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు
- సొంత కుటుంబానికే న్యాయం చేయలేకపోతే రాష్ట్ర మహిళలకు ఏం చేస్తారు?




**అమరావతి:** వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఏపీ మంత్రి నారా లోకేశ్ తీవ్ర విమర్శలు చేశారు. దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుటుంబంలో ఆయన మనవరాలి పెళ్లి జరగకుండా జగన్ అడ్డుకుంటున్నారని ఆరోపించారు. మేనకోడలి పెళ్లికి మేనమామగా ఆశీర్వదించి పంపాల్సింది పోయి, అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఈ మేరకు లోకేశ్ ట్వీట్ చేశారు. ప్రతి కుటుంబంలో మేనకోడలి పెళ్లి సమయంలో మేనమామ అన్నీ తానై వ్యవహరిస్తూ, ఆమెను ఆశీర్వదించి అత్తవారింటికి పంపుతారని లోకేశ్ పేర్కొన్నారు. అయితే జగన్ తన సొంత చెల్లెలు, మేనకోడలి విషయంలో ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. సొంత కుటుంబ సభ్యుల విషయంలోనే జగన్ తీరు దారుణంగా ఉందని ఆరోపించారు. సొంత చెల్లెలి విషయంలోనే ఇలా ప్రవర్తిస్తే, గత ఐదేళ్లలో రాష్ట్రంలోని మహిళలను, సోదరీమణులను ఆయన ఎలా చూసుకున్నారో ప్రజలకు ఇప్పటికే అర్థమైందని లోకేశ్ వ్యాఖ్యానించారు. సొంత కుటుంబానికే న్యాయం చేయలేని వ్యక్తి రాష్ట్ర ప్రజలకు ఏం చేస్తారని ప్రశ్నించారు.

## లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరికలు

మరోవైపు, ఉండవల్లిలోని తన నివాసంలో నారా లోకేశ్ సమక్షంలో మంగళగిరి నియోజకవర్గానికి చెందిన పలువురు వైసీపీ, సీపీఎం నేతలు టీడీపీలో చేరారు. సీపీఎం నేతలు శివన్నారాయణ (కొలనుకొండ), ముసలి జ్యోతిబసు (ఆత్మకూరు), వైసీపీ నేతలు నూతలపాటి చెన్నకేశవరావు (పేరుకలపూడి), ఉయ్యూరు వెంకటేశ్వరరావు (ఈమని), ముద్రబోయిన శ్రీను, షేక్ యూసబ్ (చిలువూరు) పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. వీరికి లోకేశ్ పసుపు కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. వీరితో పాటు పెద్ద సంఖ్యలో వైసీపీ, సీపీఎం కార్యకర్తలు కూడా టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

# జనసేనకు మద్దతుగా హైపర్ ఆది ప్రచారం

**పిఠాపురం, అక్టోబర్ 26 :** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. ప్రధాన పార్టీల నాయకులు, అభ్యర్థులు విస్తృతంగా పర్యటిస్తున్న వేళ, కూటమి తరఫున స్టార్ క్యాంపెయినర్లు కూడా ప్రచార బరిలోకి దిగుతున్నారు. ఇందులో భాగంగా సినీ నటుడు, జనసేన స్టార్ క్యాంపెయినర్ హైపర్ ఆది పిఠాపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పిఠాపురం పట్టణంలో ప్రచార కార్యక్రమంలో ఆది పాల్గొన్నారు. జనసేన మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థి దానం లాజర్ బాబు, కౌన్సిలర్ అభ్యర్థులు సునీత, కామేశ్వరిలకు మద్దతుగా ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా హైపర్ ఆది మాట్లాడుతూ, "పవన్ కల్యాణ్ అంటే అభివృద్ధి, అభివృద్ధి అంటే పిఠాపురం. అలాంటి పిఠాపురంలో మన గాజు గ్లాసును గెలిపించాలి. పవన్ కల్యాణ్ బలపరిచిన నాయకులను మనం గెలిపించుకుని ఆయనకు గిఫ్ట్‌గా ఇవ్వాలి. అప్పుడే మరింత అభివృద్ధి జరుగుతుంది" అని ఓటర్లకు పిలుపునిచ్చారు.





# బలవంతపు ఏకగ్రీవాలతో ప్రజాస్వామ్యానికి తూట్లు

**స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అరాచకాలకు పాల్పడిందని ఆరోపణ**

**16 మున్సిపాలిటీలు, 639 వార్డులు, 4 జెడ్పీటీసీ, 32 ఎంపీటీసీ స్థానాల ఏకగ్రీవాలపై అభ్యంతరం : వైఎస్ షర్మిల**

**విజయవాడ, అక్టోబర్ 26 :** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో నమోదైన ఏకగ్రీవాలపై ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్ర విమర్శలు చేశారు. ఇవి ప్రజల ఆమోదంతో వచ్చిన ఫలితాలు కాదని, అధికార బలంతో కూటమి పార్టీలు సాధించినవని ఆరోపించారు. సోమవారం సామాజిక మాధ్యమం ద్వారా విడుదల చేసిన ప్రకటనలో ఈ ఏకగ్రీవాలు ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించేలా ఉన్నాయని మండిపడ్డారు. రాష్ట్ర ఎన్నికల సంఘం అధికార కూటమికి అనుకూలంగా వ్యవహరిస్తోందని షర్మిల ఆరోపించారు. పోలీసు వ్యవస్థను రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటూ, ప్రతిపక్ష అభ్యర్థులను భయపెట్టి, వారి నామినేషన్ పత్రాలను చించివేశారని విమర్శించారు. 16 మున్సిపాలిటీలు, 639 వార్డులు, 4 జెడ్పీటీసీ, 32 ఎంపీటీసీ స్థానాల్లో నమోదైన ఏకగ్రీవాలు కూటమి సాధించిన రాజకీయ విజయానికి సూచికలు కావని, భయపెట్టే వాతావరణానికి నిదర్శనమని పేర్కొన్నారు. గతంలో వైసీపీ చేసిన తప్పులనే ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా చేస్తోందా అని షర్మిల ప్రశ్నించారు. ప్రజల విశ్వాసం ఉంటే బలవంతపు ఏకగ్రీవాలకు ఎందుకు పాల్పడాల్సి వస్తోందని నిలదీశారు. ఈ పరిణామాలను రాజకీయ ప్రభంజనంగా కాకుండా కూటమి రాజకీయ బలహీనతకు సంకేతంగా అభివర్ణించారు. ఏకగ్రీవాలపై రాష్ట్ర ఎన్నికల సంఘం వెంటనే స్పందించాలని షర్మిల కోరారు. ఫలితాలను నిలిపివేసి, ఆరోపణలపై పూర్తిస్థాయి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా వ్యవహరించి ప్రజాస్వామ్య విలువలను, ప్రజల ఎన్నికల హక్కులను పరిరక్షించాలని విజ్ఞప్తి చేశారు.

# శ్రీవారిని దర్శించుకున్న భారత ఉప రాష్ట్రపతి



**తిరుమల, అక్టోబర్ 26 :** భారత ఉప రాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్ సోమవారం సాయంత్రం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ముందుగా క్షేత్ర సాంప్రదాయాన్ని పాటిస్తూ ఉప రాష్ట్రపతి శ్రీ వరాహ స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం శ్రీవారి ఆలయం వద్దకు ఉప రాష్ట్రపతి చేరుకోగానే టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సీవీఎస్వో మురళీకృష్ణలు ఆయనను సాదరంగా ఆహ్వానించగా, అర్చక బృందం ఆలయ మర్యాదలతో ఇస్తికఫాల్ స్వాగతం పలికారు. తరువాత ఆయన ధ్వజస్తంభానికి నమస్కరించుకుని శ్రీవారిని దర్శించుకున్నారు. అటు పిమ్మట శ్రీ వకుళామాత, విమాన వేంకటేశ్వరస్వామి, భాష్యకార్ల సన్నిధి, యోగ నరసింహస్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం అందించారు. భారత ఉపరాష్ట్రపతికి టీటీడీ ఈవో, అదనపు ఈవో స్వామి వారి చిత్ర పటాన్ని, తీర్థప్రసాదాలను అందించారు. ఉప రాష్ట్రపతి శ్రీవారి ఆలయం ఎదురుగా ఉన్న బేడి ఆంజనేయస్వామి వారిని కూడా అనంతరం దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖుల్లో జిల్లా ఇన్ ఛార్జ్ మంత్రి అనగాని సత్య ప్రసాద్, టిటిడి బోర్డు సభ్యులు శ్రీ రామ్మూర్తి, దివాకర్ రెడ్డి, తిరుపతి ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు, పలువురు రాష్ట్రస్థాయి మరియు జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

# వాల్మీకి రామాయణమే ఆదర్శంగా కూటమి పాలన

**వాల్మీకి చిత్రపటానికి మంత్రి సవిత ఘన నివాళులు**

**పెనుకొండ, అక్టోబర్ 26 :** వాల్మీకి మహర్షి స్ఫూర్తితో రాష్ట్రంలో సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో రామరాజ్యం నడుస్తోందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. వాల్మీకీలు, బోయల రాజకీయ, సామాజిక, ఆర్థిక గుర్తింపు సీఎం చంద్రబాబునాయుడుతో సాధ్యమన్నారు. ప్రస్తుతం జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వాల్మీకి, బోయలకు అధిక ప్రాధాన్యమిచ్చామన్నారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ టీడీపీ కార్యాలయంలో సోమవారం వాల్మీకి మహర్షి జయంతి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి మంత్రి సవిత పూలమాలలు వేసి, ఘన నివాళులర్పించారు.



## సంపాదకీయం



# భారీ యుద్ధాల కోసం 'కోట' కడుతోన్న అమెరికా!

**యుద్ధ వేళల్లో 90 రోజుల పాటు స్వతంత్రంగా పనిచేసేలా సైనిక స్థావరాలు**

**విద్యుత్ కోసం పోర్టబుల్ అణు రియాక్టర్లు, భారీ బ్యాటరీ వ్యవస్థలు**

**రక్షణ రంగ తయారీకి పౌర ఫ్యాక్టరీల వినియోగం**

పశ్చిమాసియాతో పాటు ప్రపంచంలోని పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న ఘర్షణలు అంతర్జాతీయంగా ఆందోళనలను పెంచుతున్నాయి. ఈ నేపథ్యంలో భవిష్యత్తులో భారీ యుద్ధాలు తలెత్తినా, తన భూభాగాన్ని రక్షించుకోవడంతో పాటు సైనిక కార్యకలాపాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా అమెరికా సన్నద్ధమవుతోంది. యుద్ధ సమయాల్లో సరఫరా గొలుసులు, పౌర మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నప్పటికీ సైనిక స్థావరాలు కనీసం 90 రోజుల పాటు స్వతంత్రంగా పనిచేసేలా 'ఫోర్ట్రెస్' పేరుతో ఓ ప్రణాళికను అమలు చేసేందుకు పెంటగాన్ చర్యలు వేగవంతం చేసినట్లు సమాచారం. ఈ మేరకు ఫాక్స్ న్యూస్ ఓ కథనాన్ని ప్రచురించింది. దేశ రక్షణ కోసం సాధారణ పౌర మౌలిక సదు-పాయాలపై ఆధారపడటం ప్రమాదకరమని పెంటగాన్ ముఖ్య అధికార ప్రతినిధి సీన్ పార్నెల్ పేర్కొన్నట్లు ఆ కథనం వెల్లడించింది. ప్రస్తుత పరిస్థితుల్లో విద్యుత్తు అత్యంత కీలకంగా మారిందని, విద్యుత్ సరఫరా నిలిచిపోతే సమాచార వ్యవస్థలతో పాటు రవాణా సదుపాయాలపైనా ప్రభావం పడుతుందని ఆయన వివరించినట్లు తెలిపింది. ఈ సవాళ్లను ఎదుర్కొనేందుకే 'ఫోర్ట్రెస్' ప్రణాళికను రూపొందిస్తున్నట్లు పేర్కొంది. అమెరికా భూభాగ రక్షణకు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కొత్త విధానాలకు ప్రాధాన్యం ఇస్తున్నారని, 'గోల్డెన్ డోమ్', 'ఫోర్ట్రెస్' ప్రణాళికలు అందులో భాగమని పార్నెల్ వెల్లడించినట్లు కథనం పేర్కొంది. 'ఫోర్ట్రెస్' ప్రణాళికలో భాగంగా అమెరికా వ్యాప్తంగా కీలక సైనిక స్థావరాలను మరింత స్వయం సమృద్ధిగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. కనీసం 90 రోజుల పాటు బయటి సరఫరాలపై ఆధారపడకుండా కీలక కార్యకలాపాలను కొనసాగించేలా వీటిలో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయనున్నారు. నిరంతర విద్యుత్ సరఫరా కోసం పోర్టబుల్ అణు రియాక్టర్లు, భారీ సామర్థ్యం కలిగిన బ్యాటరీ వ్యవస్థలు, స్థానికంగా విద్యుత్ ఉత్పత్తి చేసి పంపిణీ చేయగల మైక్రోగ్రిడ్‌లను వినియోగించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు సమాచారం. యుద్ధ సమయంలో ఆయుధాలు, ఇంధనం, వైద్య సామగ్రి, కీలక ఖనిజాలు, విడిభాగాల కొరత ఏర్పడినా సైనిక కార్యకలాపాలు ఆగిపోకుండా ఏర్పాట్లు చేయడం ఈ ప్రణాళిక ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది. సరఫరా మార్గాలు దెబ్బతిన్నా, విద్యుత్ వ్యవస్థలు నిలిచిపోయినా సైనిక స్థావరాలు తమ కార్యకలాపాలను కొనసాగించే సామర్థ్యాన్ని పెంచుకోవడంపై దృష్టి సారిస్తున్నట్లు తెలుస్తోంది. అత్యవసర పరిస్థితుల్లో రక్షణ రంగానికి అవసరమైన వస్తువులను తయారు చేసేందుకు పౌర పరిశ్రమలను కూడా వినియోగించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. ఇందుకోసం ఫ్యాక్టరీల ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడం, అవసరమైన సాంకేతిక మార్పులు చేయడం, సైబర్ భద్రతను బలోపేతం చేయడం వంటి అంశాలపై పెంటగాన్ దృష్టి సారించినట్లు కథనం పేర్కొంది. యుద్ధ పరిస్థితుల్లో సైనిక సామర్థ్యం కేవలం ఆయుధాలకే పరిమితం కాదని, విద్యుత్, ఇంధనం, సమాచార వ్యవస్థలు, వైద్య సేవలు, పారిశ్రామిక ఉత్పత్తి వంటి రంగాలూ కీలక పాత్ర పోషిస్తాయని అమెరికా భావిస్తున్నట్లు ఈ ప్రణాళిక సూచిస్తోంది. అయితే 'ఫోర్ట్రెస్' ప్రణాళికకు సంబంధించిన పూర్తి అమలు వివరాలు, స్థావరాల ఎంపిక, నిధుల కేటాయింపు, గడువులపై మరింత స్పష్టత రావాల్సి ఉంది.

# ఢిల్లీలో నార్త్ బ్లాక్‌లో అగ్నిప్రమాదం

**రాష్ట్రపతి భవన్ సమీపంలో చెలరేగిన మంటలు**

**దట్టమైన పొగలు వ్యాపించడంతో అప్రమత్తమైన అధికారులు**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 26:** దేశ రాజధానిలోని అత్యంత కీలకమైన ప్రభుత్వ భవనాల్లో ఒకటైన నార్త్ బ్లాక్‌లో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. రాష్ట్రపతి భవన్‌కు సమీపంలో మంటలు చెలరేగడంతో ఆ ప్రాంతమంతా దట్టమైన నల్లటి పొగ వ్యాపించింది. సమాచారం అందుకున్న ఢిల్లీ అగ్నిమాపక శాఖ ఆరు వాహనాలను ఘటనా స్థలానికి పంపించింది. పార్లమెంట్‌కు వెళ్తున్న సమయంలో నార్త్ బ్లాక్ వెనుక వైపు నుంచి దట్టమైన పొగలు వెలువడటాన్ని గమనించినట్లు రాజ్యసభ సభ్యుడు మిలింద్ దేవరా తెలిపారు. ఈ విషయాన్ని ఎక్స్ వేదికగా వెల్లడిస్తూ, అక్కడ అగ్నిప్రమాదం జరిగి ఉండవచ్చని పేర్కొన్నారు. అందరూ క్షేమంగా ఉండాలని, అత్యవసర సేవలు వేగంగా స్పందించాలని ఆకాంక్షించారు. పొగలు కనిపిస్తున్న ఫొటోను కూడా ఆయన పంచుకున్నారు. ప్రమాద తీవ్రతపై స్పష్టత రావాల్సి ఉంది. మంటలు చెలరేగడానికి గల కారణాలు, అవి అదుపులోకి వచ్చాయా లేదా అనే వివరాలు ఇంకా తెలియరాలేదు. ఈ ఘటనలో ఎవరైనా గాయపడ్డారా, భవనానికి ఎంత మేర నష్టం వాటిల్లిందనే అంశాలపై కూడా అధికారిక సమాచారం వెలువడాల్సి ఉంది. అగ్నిమాపక సిబ్బంది పరిశీలన అనంతరం మరిన్ని వివరాలు తెలిసే అవకాశం ఉంది.



# మోదీతో ఆ మాట చెప్పండి

- 30 సెకన్లలో నిరసనలు ఆగిపోతాయి!
- వ్యాపారులకు రాహుల్ గాంధీ సూచన..
- 'ఓటు చోరీ'కి వ్యతిరేకంగా నవంబరు 1న 'ఇండియా' కూటమి ఆందోళన

**న్యూఢిల్లీ, అక్టోబర్ 26:** 'ఓటు చోరీ'కి వ్యతిరేకంగా నవంబరు 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో 'ఇండియా' కూటమి ఆధ్వర్యంలో నిర్వహించనున్న నిరసనను వాయిదా వేయాలని స్థానిక వ్యాపార వర్గాలు విజ్ఞప్తి చేస్తున్నాయి. దీపావళి పండగ సీజన్‌లో ఆందోళన నిర్వహిస్తే తమ వ్యాపారాలు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి లేఖ రాశాయి. ఈ విజ్ఞప్తిపై రాహుల్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని ప్రధాని నరేంద్ర మోదీని కోరితే నిరసనలు ఆగిపోతాయని వ్యాఖ్యానించారు. "ఢిల్లీలోని ప్రతి వ్యాపారి మాటను వింటున్నాం. వారి సమస్యలను అర్థం చేసుకుంటున్నాం. అయితే మెట్రోలను ప్రభుత్వమే నిలిపివేసింది. రోడ్లనూ మూసివేసింది. దేశ రాజధానిని లాక్‌డౌన్‌లో ఉంచింది. ఓట్లనే చోరీ చేస్తే.. ఇక మీ దుకాణాలు, పొదుపు సొమ్ము, పిల్లల భవిష్యత్తు.. ఏదీ సురక్షితం కాదు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని ప్రధాని నరేంద్ర మోదీతో చెప్పండి. అప్పుడు 30 సెకన్లలోనే ఈ నిరసనలన్నీ ఆగిపోతాయి" అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. దీపావళి పండగ సమయంలో ఢిల్లీలో పెద్దఎత్తున వ్యాపార కార్యకలాపాలు జరుగుతాయని ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ (సీటీఐ) తెలిపింది. నవంబరు 1న రామ్‌లీలా మైదానంలో నిరసన నిర్వహిస్తే పరిసర ప్రాంతాల్లోని వ్యాపారాలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నిరసన కారణంగా దాదాపు రూ.10 వేల కోట్ల వ్యాపారం ప్రభావితమయ్యే ప్రమాదం ఉందని అంచనా వేసింది. ఈ నేపథ్యంలో నవంబరు 10 తర్వాత నిరసనను నిర్వహించాలని కోరుతూ రాహుల్ గాంధీకి లేఖ రాసినట్లు వ్యాపార వర్గాలు తెలిపాయి. పండగ సీజన్‌లో



వినియోగదారుల రాకపోకలు, వ్యాపార లావాదేవీలకు ఆటంకం కలగకుండా చూడాలని విజ్ఞప్తి చేశాయి. మరోవైపు, ఓటు చోరీ ఆరోపణలపై తమ పోరాటాన్ని కొనసాగిస్తామని కాంగ్రెస్ నేతలు స్పష్టం చేస్తున్నారు.

# అమిత్ షా పరువు నష్టం కేసులో రాహుల్‌కు ఊరట

**ఆరేళ్ల నాటి కేసులో నిర్దోషిగా ప్రకటించిన సుల్తాన్‌పూర్ కోర్టు**

**2018 కర్ణాటక ఎన్నికల ప్రచారంలో వ్యాఖ్యలతో వివాదం**

**సుల్తాన్‌పూర్, అక్టోబర్ 26:** కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన పరువు నష్టం కేసులో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి సుల్తాన్‌పూర్ ప్రత్యేక ఎంపీ-ఎమ్మెల్యే కోర్టులో ఊరట లభించింది. ఈ కేసులో ఆయనను నిర్దోషిగా ప్రకటిస్తూ కోర్టు తీర్పు వెలువరించినట్లు రాహుల్ తరఫు న్యాయవాది కాశీ ప్రసాద్ శుక్లా వెల్లడించారు. తీర్పు వెలువడే సమయంలో రాహుల్ గాంధీ స్వయంగా కోర్టుకు హాజరయ్యారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా 2018 మే 8న బెంగళూరులో జరిగిన సభలో అప్పటి బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షాపై రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారితీశాయి. అదే ఏడాది ఆగస్టు 4న బీజేపీ నేత, జిల్లా సహకార బ్యాంకు మాజీ అధ్యక్షుడు విజయ్ మిశ్రా పరువు నష్టం ఫిర్యాదు చేశారు. ఈ కేసులో విచారణకు హాజరుకావాలని 2023 నవంబర్ 27న కోర్టు రాహుల్‌కు సమన్లు జారీ చేసింది. 2024 ఫిబ్రవరి 20న కోర్టుకు హాజరైన ఆయనకు బెయిల్ లభించింది. అదే ఏడాది జూలై 26న రాహుల్ వాంగ్మూలాన్ని, అక్టోబర్ 9న ఫిర్యాదుదారు విజయ్ మిశ్రా వాంగ్మూలాన్ని కోర్టు నమోదు చేసింది. 2025 ఫిబ్రవరి 28న ఫిర్యాదుదారు తరఫు సాక్షి అనిల్ మిశ్రా వాంగ్మూలాన్ని నమోదు చేశారు. అదే ఏడాది డిసెంబర్ 8న మరో సాక్షి రామచంద్ర దూబే వాంగ్మూలాన్ని కోర్టు రికార్డు చేసింది. అనంతరం ఈ ఏడాది ఫిబ్రవరి 20న రాహుల్ గాంధీ వాంగ్మూలాన్ని నమోదు చేశారు. ఆయన వాయిస్ శాంపిల్స్‌ను సరిపోల్చాలని విజయ్ మిశ్రా దాఖలు చేసిన పిటిషన్‌ను మేజిస్ట్రేట్ కోర్టు మార్చి 12 తర్వాత విచారించి తిరస్కరించింది. ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ సెషన్స్ కోర్టును ఆశ్రయించగా, జూలై 15న అక్కడా చుక్కెదురైంది. సెప్టెంబర్ 10న హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ కూడా తిరస్కరణకు గురైంది. అక్టోబర్ 6న కేసులో తుది వాదనలు ప్రారంభమై, అక్టోబర్ 12 నాటికి విచారణ పూర్తయింది. అనంతరం సుల్తాన్‌పూర్ ప్రత్యేక ఎంపీ-ఎమ్మెల్యే కోర్టు రాహుల్ గాంధీని నిర్దోషిగా ప్రకటిస్తూ తీర్పు వెలువరించినట్లు ఆయన న్యాయవాది తెలిపారు. దీంతో 2018లో ప్రారంభమైన పరువు నష్టం కేసు సుదీర్ఘ విచారణకు ముగింపు లభించింది.

# ఖర్గే వ్యాఖ్యల దుమారం

**దేశవ్యాప్తంగా బీజేపీ శ్రేణుల నిరసనలు!**

- ప్రధాని మోదీపై వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో భగ్గుమన్న కమలనాథులు
- కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాజీనామా చేయాలని, క్షమాపణ చెప్పాలని కమలదళం డిమాండ్

**న్యూఢిల్లీ, అక్టోబర్ 26:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. ప్రధాని మోదీపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో బీజేపీ శ్రేణులు దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టాయి. ఈ వ్యాఖ్యలకు నిరసనగా భారతీయ జనతా పార్టీ (బీజేపీ) శ్రేణులు దేశవ్యాప్తంగా అగ్రహావేశాలు వ్యక్తం చేస్తూ ఆందోళన బాట పట్టాయి. ప్రధాని మోదీపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో బీజేపీ శ్రేణులు దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టాయి. ఖర్గే వెంటనే తన కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాజీనామా చేయాలని, ప్రధాని మోదీకి బహిరంగ క్షమాపణ చెప్పాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఖర్గే తన అధ్యక్ష పదవికి రాజీనామా చేయాలంటూ కమలనాథులు ఆందోళనలు నిర్వహిస్తున్నారు., ప్రధాని





మోదీకి ఖర్గే బహిరంగ క్షమాపణ చెప్పాలని పట్టుబట్టారు. ఆదివారం బిహార్‌లోని పట్నాలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న మల్లికార్జున ఖర్గే మాట్లాడుతు.. 'మోదీ కాదు.. ఆయన బాబైనా పోవాల్సిందే' అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆదివారం బిహార్‌లోని పట్నాలో ఓ కార్యక్రమానికి హాజరైన మల్లికార్జున ఖర్గే.. 'మోదీ కాదు.. ఆయన బాబైనా పోవాల్సిందే' అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఈ వ్యాఖ్యలపై కాషాయ పార్టీ నాయకులు తీవ్ర స్థాయిలో భగ్గుమన్నారు. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా ఉన్న బీజేపీ ప్రధాన కార్యాలయాల ఎదుట ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా ఉన్న బీజేపీ ప్రధాన కార్యాలయాల్లో ఆ పార్టీ నాయకులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. పలుచోట్ల ఖర్గే దిష్టిబొమ్మలను దహనం చేయడంతో పాటు, ఆయన పోస్టర్లకు నిప్పంటించి కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఖర్గే దిష్టిబొమ్మలను దహనం చేశారు. అలాగే ఆయన పోస్టర్లకు నిప్పంటించి, వ్యతిరేక నినాదాలు చేశారు. ముఖ్యంగా బిహార్‌వ్యాప్తంగా కమలనాథులు పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టారు. బిహార్‌లో కమలనాథులు ఆందోళనలు నిర్వహించి, కాంగ్రెస్ అధ్యక్షుడు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

**విమర్శించిన కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్:**

ఈ వివాదంపై బీజేపీ అగ్ర నాయకులు తీవ్రంగా స్పందించారు. ఖర్గే చేసిన వ్యాఖ్యలను కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తీవ్రంగా తప్పుపట్టారు. "ఇది అత్యంత బాధాకరమైన విషయం. ఈ మొత్తం వ్యవహారంలో నన్ను తీవ్రంగా దిగ్భ్రాంతికి గురిచేసిన అంశం ఏమిటంటే.. ఈ తరహా చౌకబారు వ్యాఖ్యలు కాంగ్రెస్‌లోని ఏదో చిన్న స్థాయి నాయకుడు చేయలేదు, ఏకంగా ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడే చేయడం బాధ్యతారాహిత్యం" అని రాజ్‌నాథ్ సింగ్ తన ఆవేదనను వ్యక్తం చేశారు. 'ఇది చాలా బాధాకరం. ఈ మొత్తం వ్యవహారంలో అత్యంత దిగ్భ్రాంతికరమైన విషయం ఏంటంటే.. ఈ వ్యాఖ్యలను కాంగ్రెస్‌లో చిన్న స్థాయి వ్యక్తి చేయలేదు. ఏకంగా ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు చేశారు' అని ఆవేదన వ్యక్తం చేశారు.

# జామియా విద్యార్థుల దీక్షకు పాక్షికంగా తెర

**విద్యార్థి సంఘం ఎన్నికలకు యూనివర్సిటీ అంగీకారం**

**సస్పెన్షన్లు, షోకాజ్ నోటీసుల ఉపసంహరణకు నిర్ణయం**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 26:** జామియా మిల్లియా ఇస్లామియా యూనివర్సిటీలో విద్యార్థుల నిరాహార దీక్షకు పాక్షికంగా తెరపడింది. విద్యార్థులు లేవనెత్తిన ప్రధాన డిమాండ్లపై యూనివర్సిటీ యాజమాన్యం అక్టోబర్ 26, 2026న అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. విద్యార్థి సంఘం ఎన్నికలు నిర్వహించడం, ఆందోళన సందర్భంగా విధించిన సస్పెన్షన్లు, షోకాజ్ నోటీసులను ఉపసంహరించుకోవడం, భద్రతా సిబ్బంది వ్యవహారంపై విచారణ చేపట్టడం వంటి నిర్ణయాలను ప్రకటించింది. అయితే, ఎన్నికల పోలింగ్ తేదీ ఖరారు కాకపోవడంతో కొందరు విద్యార్థులు నిరసన కొనసాగిస్తున్నారు. విద్యార్థి సంఘం ఎన్నికలు నిర్వహించాలన్న డిమాండ్‌కు యూనివర్సిటీ అంగీకరించింది. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.డి. మెహతాబ్ ఆలం రిజ్వీ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, విద్యార్థి సంఘం రాజ్యాంగానికి ఆమోదం లభించిన 15 రోజుల తర్వాత ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. అయితే, ఆ రాజ్యాంగానికి ఎప్పుడు ఆమోదం లభిస్తుందనే దానిపై స్పష్టత లేదు. దీంతో పోలింగ్ తేదీని ఇంకా ప్రకటించలేదు. ఆందోళన సమయంలో విద్యార్థులపై విధించిన సస్పెన్షన్లను రద్దు చేయడంతో పాటు జారీ చేసిన షోకాజ్ నోటీసులను ఉపసంహరించుకోవాలని యూనివర్సిటీ నిర్ణయించింది. అదే సమయంలో, యాజమాన్యానికి పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలు, చర్యలు, సోషల్ మీడియా పోస్టులపై విద్యార్థులు బహిరంగంగా క్షమాపణ చెప్పేందుకు అంగీకరించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇందుకోసం ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించడం, సంబంధిత పోస్టులను తొలగించడం వంటి చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. విద్యార్థుల నిరసన సమయంలో భద్రతా సిబ్బంది వ్యవహరించిన తీరుపై విచారణ జరిపేందుకు కమిటీని ఏర్పాటు చేయాలని కూడా యాజమాన్యం నిర్ణయించింది. యూనివర్సిటీ నిర్ణయాలపై కొంతమంది విద్యార్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలు నిర్వహిస్తామని ప్రకటించినప్పటికీ, పోలింగ్ తేదీని ఖరారు చేయకపోవడంపై అభ్యంతరం చెబుతున్నారు. ఈ నేపథ్యంలో గేట్ నంబర్ 7 వద్ద టెంట్లు వేసుకుని నిరసన కొనసాగిస్తున్నారు. ఎన్నికల షెడ్యూల్‌పై స్పష్టత వచ్చేవరకు ఆందోళన విరమించబోమని చెబుతున్నారు. విద్యార్థి సంఘం రాజ్యాంగానికి ఆమోదం లభించిన తర్వాతే ఎన్నికల నిర్వహణకు సంబంధించిన 15 రోజుల గడువు ప్రారంభం కానుంది. దీంతో రాజ్యాంగం ఆమోదం, ఎన్నికల షెడ్యూల్ ప్రకటనపై ఉత్కంఠ నెలకొంది.



# పలమనేరులో స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలన

**కౌంటింగ్ హాళ్లను పరిశీలించిన కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ తుషార్ డూడి**

**నిరంతర నిఘా ఉంచాలని అధికారులకు ఆదేశాలు**

**చిత్తూరు, అక్టోబర్ 26 (సమయం న్యూస్):** పలమనేరు డిగ్రీ కళాశాలలో మున్సిపల్, ఎంపీటీసీ ఎన్నికల స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ హాళ్లను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ (ఐఏఎస్), ఎస్పీ తుషార్ డూడి (ఐపీఎస్) పరిశీలించారు. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద నిరంతర నిఘా ఉంచాలని, కౌంటింగ్ కేంద్రాల్లో తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎన్నికల విధుల్లో సహకరించిన ఎన్ సీసీ, ఎన్ ఎస్ఎస్ విద్యార్థులను కలెక్టర్, ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# పొంచివున్న 'అర్నబ్' ముప్పు

**తూర్పు మధ్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న తుఫాన్**

**రాష్ట్రంలో రేపు, ఎల్లుండి అత్యంత భారీ వర్షాలు**

**అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ సూచన**



**అమరావతి, అక్టోబర్ 26 (సమయం న్యూస్):** తూర్పు మధ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అర్నబ్ తుఫాన్ గంటకు 13 కిలోమీటర్ల వేగంతో కదులుతోంది. ప్రస్తుతం ఇది విశాఖపట్నానికి 540 కిలోమీటర్లు, కాకినాడకు 620, మచిలీపట్నానికి 720, బాపట్లకు 790 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. తుఫాన్ ప్రభావంతో రేపు, ఎల్లుండి కొన్ని ప్రాంతాల్లో అత్యంత భారీ వర్షాలు, బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. తుఫాన్ తీరానికి చేరువయ్యే కొద్దీ తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రెండు రోజుల పాటు అనవసర ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని ఆయన సూచించారు.

# తుఫాన్ ముప్పుపై అధికారులకు సీఎం అలర్ట్

**భారీ వర్షాల నేపథ్యంలో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాల మోహరింపు**

**లోతట్టు ప్రాంతాల ప్రజలను షెల్టర్లకు తరలించాలని ఆదేశం**

**విద్యుత్ సరఫరా, రిజర్వాయర్లపై ప్రత్యేక దృష్టి**

**అమరావతి, అక్టోబర్ 26 (సమయం న్యూస్):** అర్నబ్ తుఫాను ప్రభావంతో 28, 29 తేదీల్లో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను అప్రమత్తం చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను వెంటనే షెల్టర్లకు తరలించాలని, గర్భిణులు, వృద్ధులు, దివ్యాంగులు, శిశువులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. ఏడు ఎన్డీఆర్ఎఫ్, ఎనిమిది ఎస్డీఆర్ఎఫ్ బృందాలను ప్రభావిత జిల్లాల్లో మోహరించాలని సూచించారు. ఇప్పటికే 30,043 పడవలను సురక్షితంగా హార్బర్లకు చేర్చినట్లు అధికారులు సీఎంకు వివరించారు. పంటలు, రిజర్వాయర్లు, విద్యుత్ సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ప్రతి నాలుగు గంటలకు తుఫాను హెచ్చరికలు జారీ చేయాలని సీఎం ఆదేశించారు.

# తిరుపతిలో డీజీపీలు, ఐజీపీల జాతీయ స్థాయి సదస్సు

**హాజరుకానున్న ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా**

**అమరావతి, అక్టోబర్ 26 (సమయం న్యూస్):** తిరుపతిలో డిసెంబర్ 4 నుంచి 6 వరకు డీజీపీలు, ఐజీపీల జాతీయ స్థాయి సమావేశం జరగనుంది. ఈ ప్రతిష్టాత్మక సదస్సుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా హాజరుకానున్నారు. సమావేశానికి 200 మందికి పైగా ఐపీఎస్ అధికారులు, ఐబీ అధికారులు, కేంద్ర, రాష్ట్ర భద్రతా బలగాల ఉన్నతాధికారులు పాల్గొననున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లపై సీఎస్ జి.సాయిప్రసాద్ సమీక్ష నిర్వహించారు. భద్రత, వసతి, రవాణా, నగర సుందరీకరణ తదితర ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు.

# టెలికాం పెన్షనర్లకు జీవన్ ప్రమాణ్ క్యాంపులు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 26 (సమయం న్యూస్):** ఢిల్లీ–ఎన్ సీఆర్ లో టెలికాం పెన్షనర్ల కోసం నవంబర్‌లో జీవన్ ప్రమాణ్ (డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్) క్యాంపులు నిర్వహించనున్నారు. నవంబర్ 3 నుంచి 27 వరకు ఢిల్లీ, గురుగ్రామ్, ఫరీదాబాద్, నోయిడాలోని వివిధ ఎంటీఎన్ఎల్, బీఎస్ఎన్ఎల్ కేంద్రాల్లో ఈ క్యాంపులు జరుగుతాయి. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సేవలు అందుబాటులో ఉంటాయి. డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్, ఫేస్ ఆథెంటికేషన్ శిక్షణ, కేవైపీ ఫారాల సమర్పణ, ఫిర్యాదుల స్వీకరణ లాంటి సేవలు అందిస్తారు. ఇప్పటికే లైఫ్ సర్టిఫికెట్ సమర్పించిన వారు మళ్లీ హాజరు కావాల్సిన అవసరం లేదు.





# ఆవిష్కరణలతోనే ఆరోగ్య సవాళ్లకు పరిష్కారం

- ఆవిష్కరణలతోనే ఆరోగ్య సవాళ్లకు పరిష్కారం
- డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య వర్సిటీ రూబీ జూబ్లీ వేడుకల్లో ఉపరాష్ట్రపతి
- టెక్నాలజీతో పాటు మానవీయతకూ ప్రాధాన్యం ఇవ్వాలని సూచన
- డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం అందరి బాధ్యతని వెల్లడి





**విజయవాడ, అక్టోబర్ 26 (సమయం న్యూస్):** మానవాళి ఎదుర్కొంటున్న ఆరోగ్య సవాళ్లకు పరిష్కారాలు చూపేలా వైద్య పరిశోధనలు, ఆవిష్కరణలను మరింత బలోపేతం చేయాలని భారత ఉపరాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్ పిలుపునిచ్చారు. డాక్టర్ ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ 40వ రూబీ జూబ్లీ వేడుకల్లో ఆయన ప్రసంగించారు. నాలుగు దశాబ్దాలుగా వైద్య విద్య, ఆరోగ్య సేవలకు విశ్వవిద్యాలయం అందిస్తున్న సేవలను అభినందించారు. డాక్టర్ ఎన్టీఆర్ ప్రాంతీయ హద్దులకు అతీతంగా దేశ సంక్షేమాన్ని ఆలోచించిన గొప్ప నాయకుడని కొనియాడారు. 2014కు ముందు దేశంలో 387గా ఉన్న వైద్య కళాశాలలు ప్రస్తుతం 846కు పెరిగాయని, ఎంబీబీఎస్ సీట్లు సుమారు 51 వేల నుంచి 1.4 లక్షలకు పైగా, పీజీ సీట్లు 31 వేల నుంచి 86 వేలకు పైగా పెరిగాయని వివరించారు. కృత్రిమ మేధస్సు, డిజిటల్ హెల్త్, టెలీమెడిసిన్, ఆధునిక నిర్ధారణ సాంకేతికతలు వైద్య రంగాన్ని మారుస్తున్నాయని పేర్కొన్న ఉపరాష్ట్రపతి.. సాంకేతికతతో పాటు రోగి భద్రత, డేటా గోప్యత, నైతిక విలువలు, మానవీయతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. వైద్యుడుఉరోగి సంబంధంలో కరుణ, మానవీయ స్పర్శకు సాంకేతికత ప్రత్యామ్నాయం కాదని స్పష్టం చేశారు. మాదకద్రవ్యాల దుర్వినియోగంపై వైద్యులు చురుకైన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం అందరి బాధ్యతగా పేర్కొంటూ, డ్రగ్స్‌కు నో చెప్పే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం విశ్వవిద్యాలయం 40 ఏళ్ల ప్రస్థానాన్ని ప్రతిబింబించే సావనీర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, మంత్రి కొలుసు పార్థసారథి తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు విమానాశ్రయంలో ఉపరాష్ట్రపతికి గవర్నర్, మంత్రి నారా లోకేష్ తదితరులు ఘన స్వాగతం పలికారు.

## ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్‌కు ఘన స్వాగతం

**తిరుపతి, అక్టోబర్ 26 (సమయం న్యూస్):** రెండు రోజుల తిరుమలఉతిరుపతి పర్యటనలో భాగంగా సోమవారం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న భారత ఉప రాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్‌కు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, డీఐజీ షిమోషి, జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు, సిమ్స్ డైరెక్టర్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు. విమానాశ్రయంలో స్వాగత కార్యక్రమం అనంతరం ఉప రాష్ట్రపతి అక్కడి నుంచి నేరుగా తిరుమలకు బయలుదేరి వెళ్లారు.

# వైద్య విద్యలో త్వరలో 'క్వాంటం బయాలజీ'

- డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం 40వ రూబీ జూబ్లీ వేడుకలు
- పరిశోధనలకు రూ.13 కోట్ల నిధుల కేటాయింపు
- ప్రత్యేకంగా మెడికల్ అకాడమీ ఏర్పాటు చేయాలని వీసీ విజ్ఞప్తి

**విజయవాడ, అక్టోబర్ 26 (సమయం న్యూస్):** డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం 40వ రూబీ జూబ్లీ వేడుకలు విజయవాడలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కళావేదికలో ఘనంగా జరిగాయి. వీసీ డాక్టర్ పి.చంద్రశేఖర్ మాట్లాడుతూ.. వైద్య పరిశోధనలను ప్రోత్సహించేందుకు విశ్వవిద్యాలయం ఇప్పటికే సుమారు రూ.13 కోట్ల నిధులు కేటాయించిందని తెలిపారు. ఆధునిక వైద్య అవసరాలకు అనుగుణంగా వివిధ పోస్ట్–డాక్టోరల్ ఫెలోషిప్, సర్టిఫికెట్ కోర్సులు నిర్వహిస్తున్నామని, త్వరలో వినూత్నమైన 'క్వాంటం బయాలజీ' కోర్సును ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. వైద్య విద్య భవిష్యత్తులో ఏఐ, డిజిటల్ టెక్నాలజీ, సిమ్యులేషన్ ఆధారిత విద్యతో మరింతగా ముడిపడుతుందని ఆయన పేర్కొన్నారు. వైద్యుల నిరంతర శిక్షణ, నైపుణ్యాభివృద్ధి, పరిశోధనల కోసం రాష్ట్రంలో ప్రత్యేకంగా 'మెడికల్ అకాడమీ' ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎన్ఎంసీ మెడికల్ అసెస్‌మెంట్ అండ్ రేటింగ్ బోర్డు డైరెక్టర్ డాక్టర్ ఎం.కె.రమేష్ మాట్లాడుతూ, ఆధునిక సాంకేతికతను వినియోగించడంతో పాటు వైద్యులు మానవీయ విలువలు, సానుభూతి, నైతిక ప్రమాణాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. విద్యార్థుల్లో చిన్న వయస్సు నుంచే పరిశోధనా దృక్పథం, శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని పెంపొందించాలన్నారు. భారత్ తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్య సేవలు అందిస్తూ అంతర్జాతీయ హెల్త్ టూరిజం కేంద్రంగా ఎదుగుతోందని ఆయన తెలిపారు.







# జాతీయ సారస్ మేళాలో 'హర్ జర్నీ'

- విజయవాడ పున్నమి ఘాట్‌లో ఎస్ఎంఈ ఫోరం ఆధ్వర్యంలో కార్యక్రమం
- వ్యాపార మెళకువలు తెలుసుకున్న 300 మంది మహిళలు

**విజయవాడ, అక్టోబర్ 26 (సమయం న్యూస్):** జాతీయ సారస్ మేళాఉ2026లో భాగంగా విజయవాడ పున్నమి ఘాట్‌లో ఇండియా ఎస్ఎంఈ ఫోరం ఆధ్వర్యంలో 'హర్ జర్నీ' కార్యక్రమం నిర్వహించారు. ఓఎస్కే కాడెంజా అడ్వాంటేజ్ ఇండియా వ్యవస్థాపకురాలు హేమలత మహిళా ఔత్సాహికులతో తన వ్యాపార అనుభవాలను పంచుకున్నారు. సెర్ప్, మెప్మాలకు చెందిన కాకినాడ, మార్కాపురం, బాపట్ల జిల్లాల నుంచి సుమారు 300 మంది ఎస్హెచ్ జీ మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వ్యాపార అభివృద్ధి, మార్కెటింగ్, మార్కెట్ అవకాశాలపై హేమలత పలు సూచనలు అందించారు. సవాళ్లను అవకాశాలుగా మలుచుకుని, నాణ్యత, నిరంతర అభ్యాసం, మార్కెట్ మార్పులకు అనుగుణంగా వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమం మహిళా పారిశ్రామికవేత్తలకు ఎంతగానో స్ఫూర్తినిచ్చింది.



# జానపద కవిరాజు కొసరాజు

## నేడు కొసరాజు రాఘవయ్య వర్ధంతి

తెలుగు చిత్రసీమలో జానపదం అనగానే ముందుగా గుర్తుకు వచ్చే నటులు నందమూరి తారక రామారావు, దర్శకుడు బి.విఠలాచార్య కాగా, జానపద గీతం అనగానే వెనువెంటనే స్ఫురించే పేరు కొసరాజు రాఘవయ్య చౌదరిదే. కొసరాజు రాఘవయ్య చౌదరి, తెలుగు జానపద సాహిత్యానికి ఎనలేని కీర్తిని తెచ్చిన ప్రముఖ కవి, గీత రచయిత, రచయిత. 'జానపద కవిరాజు'గా, 'కవిరత్న'గా ప్రశంసలందుకున్న ఆయన తెలుగు జానపద సాహిత్యంలో గాథల్ని సృష్టించారు. 1905లో ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా బాపట్ల తాలూకా కర్లపాలెం మండలం, చింతాయపాలెం గ్రామంలో లక్ష్మమ్మ, సుబ్బయ్య దంపతులకు జన్మించిన రాఘవయ్య జీవితమంతా తెలుగు గ్రామీణ జీవనాన్ని తన రచనల్లో ప్రతిబింబించాడు. తెలుగు జానపద సాహిత్యాన్ని సమున్నతంగా నిలిపిన కొసరాజు రాఘవయ్య, కేవలం పాటల రచయితగానే కాక, పల్లె జీవితం, సంప్రదాయాలు, పండుగలు, వ్యవసాయం వంటి అంశాలను తన గీతాల్లో చక్కగా మేళవించాడు. ఆయన రచనల్లో గ్రామీణ ప్రజల శైలీ, జీవన విధానాలు, పండుగ సంబరాలు, పెళ్లిళ్లు, పల్లె జీవనంలోని ప్రత్యేకతలు స్పష్టంగా ప్రతిఫలిస్తాయి. పాఠకుడు పల్లె జీవితం, పల్లె సౌందర్యాన్ని ఆస్వాదించగలిగేలా తన రచనల ద్వారా ఆయన తెలుగుదనాన్ని పంచాడు. ప్రకృతి, పొలాలు, పక్షులు, చెట్లు, జంతువులు, నదులు వంటి ప్రకృతి అంశాలను ఆయన తన రచనల్లో అద్భుతంగా మిళితం చేసి, పాఠకులను ప్రేరేపించాడు. కొసరాజు రాఘవయ్య తన రచనల్లో కుల వివక్ష, అణగారిన వర్గాల సమస్యలు, అవినీతి వంటి సామాజిక సమస్యలను సునిశితంగా ప్రస్తావించారు. పల్లె ప్రజల దుఃఖాలు, అణచివేతలను వ్యక్తం చేస్తూ సమాజంలో మార్పు రావాలనే కృతనిశ్చయంతో తన రచనల్లో సామాజిక సందేశాలను చేర్చారు. మానవ జీవనంలోని ప్రేమ, విరహం, మమత వంటి భావజాలాలను సున్నితంగా, హృద్యంగా, అత్యంత చక్కగా ప్రతిబింబించారు. ఈ పాటలు గాఢమైన భావనలతో పాఠకులను హత్తుకునేలా ఉంటాయి. సాధారణ ప్రజల జీవనంలోని హాస్యాన్ని కూడా ఆయన రచనలు అద్భుతంగా ప్రతిబింబిస్తాయి, పాఠకుడిని అలరిస్తాయి. రాఘవయ్య తొలిసారిగా కథానాయకునిగా 1939లో "రైతుబిడ్డ" చిత్రంలో నటించారు. తరువాత ఆయన కవిత్వ ప్రతిభను గుర్తించిన బి.ఎ. సుబ్బారావు, కె.వి. రెడ్డి వంటి దర్శకులు ఆయన్ని తమ చిత్రాలకు పాటలు వ్రాయించేందుకు ఆహ్వానించారు. 1954లో విడుదలైన "పెద్ద మనుషులు" చిత్రంలో ఆయన రాసిన పాటలు తెలుగు ప్రేక్షకుల మనసులను చూరగొన్నాయి. "రాజు పేద" చిత్రంలో ఆయన రాసిన "జేబులో బొమ్మ జేజేల బొమ్మ" పాట భలే ప్రాచుర్యం పొందింది. అలాగే "రోజులు మారాయి" చిత్రంలోని "ఏరువాక సాగారో," "ఇల్లరికములో ఉన్న మజా," వంటి పాటలు ఆయన ప్రతిభకు నిలువుటద్దంగా నిలిచాయ "జేబులో బొమ్మ జేజేల బొమ్మ", "ఏరువాక సాగారో", "ఇల్లరికములో ఉన్న మజా", "అయయో జేబులో డబ్బులు పోయెనే", "ముద్దబంతి పూలు బెట్టి", "మత్తు వదలరా నిద్దుర మత్తు వదలరా" మొదలైన గీతాలు చిరస్థాయిగా నిలిచిపోయే జ్ఞాపకాలు. కొసరాజు రాసిన పాటలు పల్లె ప్రజల జీవితానికి ప్రతిధ్వనులుగా నిలిచాయి. ఈ గీతాలు మామూలు ప్రజల భావాలను అక్షరాలుగా మార్చాయి. కొసరాజు రాసిన కొన్ని గీతాలు శాశ్వతంగా ప్రజల మనస్సులలో నిలిచిపోయాయి, అవి ప్రతి పల్లె వాసి హృదయాన్నే కాదు, వారి జీవితాలనూ ప్రతిబింబించాయి. "కళ్ళు తెరచికనరా," "జయమ్ము నిశ్చయమ్మురా," "వినరా వినరా నరుడా" వంటి గీతాలు గ్రామీణ ప్రజల మనోభావాలను, వారి ఆశలను ప్రతిబింబించాయి. కొసరాజు రాఘవయ్య 1984లో రఘుపతి వెంకయ్య అవార్డు అందుకున్నారు. "కవిరత్న," "జానపద కవిసార్వభౌమ" వంటి బిరుదులతో గౌరవింపబడ్డారు. ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ నిర్వహించిన బుర్రకథల పోటీలో ఆయన రాసిన "నవభారతం" బుర్రకథ ప్రథమ బహుమతిని అందుకుంది. చివరి బుర్రకథగా నిలిచిన "వినరా, ఆంధ్రకు మారా" అనే కృతి 1986 అక్టోబర్ 27న రాశారు; అదే రోజున ఆయన పరమ పదించారు. కొసరాజు రాఘవయ్య రచనలు తెలుగు సాహిత్యానికి ఒక అమూల్యమైన నిధిగా నిలిచాయి. ఆయన పాటలు, కవితలు తెలుగు ప్రజల మనసులను హత్తుకునేలా ఉంటాయి. పల్లె జీవితం, ప్రకృతి, గ్రామీణ సంస్కృతి, తెలుగు భాషలోని విలువలను ప్రతిబింబిస్తూ పాఠకులను స్ఫూర్తి ప్రదాయకంగా ప్రేరేపించాయి. రాఘవయ్య రాసిన పాటలు, బుర్రకథలు, కవిత్వం తెలుగు జానపద సాహిత్యానికి నిలువుటద్దంగా, నిత్య కీర్తిగా నిలిచిపోయాయి.



రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# భారత పదాతి దళం - దేశానికి కవచం

### నేడు భారత పదాతిదళ దినోత్సవం...

### కశ్మీర్ నుంచి పాక్ కబాలీలను తరిమి తరిమి కొట్టిన రోజు



భారత పదాతి దళం భారత సైన్యంలో అతిపెద్ద భాగం. దేశ రక్షణలో కీలక పాత్ర పోషిస్తుంది. పదాతి దళ దినోత్సవం ప్రతి సంవత్సరం అక్టోబర్ 27న జరుపుకుంటారు. 1947లో కశ్మీర్‌ను పాకిస్తాన్ ఆక్రమించకుండా కాపాడిన రోజును గుర్తు చేసుకుంటారు. 1947లో పాకిస్తాన్ కశ్మీర్‌ను ఆక్రమించడానికి ప్రయత్నించింది. భారత సైన్యం దాడిని విఫలం చేసింది. భారత సైన్యం లో అతిపెద్ద పోరాట విభాగమైన పదాతిదళం దేశానికి అందించిన సేవలు గుర్తించడానికి ప్రతి సంవత్సరం అక్టోబరు 27న పదాతి దళ దినోత్సవాన్ని నిర్వహించడం జరుగుతోంది. భారత సైన్యంలో అతిపెద్ద దళం పదాతి దళం. భూమిపై యుద్ధాలు చేయడం వీరి ప్రధాన బాధ్యత. వీరు దేశ రక్షణలో కీలక పాత్ర పోషిస్తారు. పదాతిదళ దినోత్సవం ముఖ్య ఉద్దేశం దేశానికి సేవ చేస్తూ తమ ప్రాణాలను త్యాగం చేసిన అమరులను గౌరవించి, హృదయపూర్వక నివాళి అర్పించడం. అంతేకాదు, భారత సైనికులు చేసిన త్యాగాలు, సేవల గురించి దేశ ప్రజలకు అవగాహన కల్పించడం. భారత్ పాక్ ల మధ్య జరిగిన నాలుగు యుద్ధాలలో ఇది మొదటిది కశ్మీర్ యుద్ధం. స్వాతంత్ర్యం పొందిన రెండు దేశాల మధ్య జరిగిన యుద్ధ పరిణామాలు నేటికీ ఇరు దేశాల భౌగోళిక, రాజకీయాలను ప్రభావితం చేస్తూనే ఉన్నాయి. కశ్మీర్ విలీనం విషయంలో అప్పటి రాజు హరిసింగ్ తీసుకున్న నిర్ణయం పాక్‌కు షాకిచ్చింది. దీంతో కశ్మీర్‌ను ఆక్రమించుకోడానికి ప్రయత్నిస్తున్న పాక్‌కు.. భారత్ సైన్యం తగిన గుణపాఠం చెప్పిన తరిమి కొట్టింది. భారత సైన్యంలో అతిపెద్ద పోరాట విభాగమైన పదాతిదళం దేశానికి అందజేస్తోన్న సేవలకు గుర్తుగా ఏటా అక్టోబరు 27న పదాతి దళ దినోత్సవాన్ని నిర్వహించుకుంటాం. అక్టోబర్ 27 భారత సైన్యానికి చాలా ముఖ్యమైన రోజు. 1947లో ఇదే రోజున భారత సైనికులు.. పాకిస్థాన్ మద్దతుతో జమ్మూ కశ్మీర్‌ను ఆక్రమించేందుకు వచ్చిన మూకలను పొలిమేరల నుంచి తిప్పికొట్టి తోకముడిచేలా చేశారు. దేశ విభజన తర్వాత కశ్మీర్ సంస్థానం ఎటు వెళ్ళాలో తేల్చుకోలేని పరిస్థితిలో మిగిలింది. కశ్మీర్ తన స్వతంత్ర ప్రతిపత్తిని నిలబెట్టుకోవాలని బలంగా కోరుకున్నప్పటికీ.. నాటి రాజకీయ పరిణామాలు ఎటో ఒకవైపు విలీనం కావాల్సిన పరిస్థితిని కల్పించాయి.

1947 ఆగస్టులో విభజన కారణంగా సాగిన హింస నుంచి కశ్మీర్ కూడా తప్పించుకోలేక పోయింది. పాకిస్థాన్ గిరిజనులు కశ్మీర్‌లోని మొహురా విద్యుత్ కేంద్రంపై దాడి చేయాగా, హరిసింగ్ భారత ప్రభుత్వం సాయం కోరారు. వెంటనే స్పందించిన భారత ప్రభుత్వం రాజుకు అండగా సైన్యాన్ని పంపింది. పాకిస్తాన్ గిరిజనులుగా చెప్పుకునే కబాలీలను భారత సైన్యం తరిమికొట్టింది. ఆ తర్వాత కశ్మీర్‌ను భారత్‌లో కలుపుతున్నట్లు ఒప్పందంపై అక్టోబరు 26న మహారాజు హరిసింగ్ సంతకం చేశారు. భారత ప్రధాని నెహ్రూ ఆదేశాలతో సిక్ రెజ్మెంట్ మొదటి బెటాలియన్.. అక్టోబరు 27న శ్రీనగర్ చేరుకుని పాక్ చొరబాటు దారులను తరిమి తరిమి కొట్టింది. పాక్ రేంజర్ల నుంచి కశ్మీర్‌ను కాపాడిన భారత సైన్యం.. ఈ క్రమంలో అనేక మంది సైనికులను కోల్పోయింది. పాకిస్తాన్ ఆక్రమణ దారులను అరికట్టడంలో లెఫ్టినెంట్ కల్నల్ దివాన్ రంజిత్ రాయ్ ముఖ్యమైన పాత్ర పోషించారు. కానీ దురదృష్టవశాత్తు బారాముల్లా ప్రాంతంలో ప్రాణాలు కోల్పోయాడు. ఆయన ధైర్యసాహసాలు, దేశం పట్ల ప్రేమకు గుర్తుగా మరణానంతరం మహావీర చక్ర అవార్డు వరించింది.

### పదాతి దళం యొక్క ముఖ్య విధులు:

దేశ సరిహద్దుల రక్షణ: చైనా, పాకిస్తాన్ వంటి దేశాలతో ఉన్న సరిహద్దులను కాపాడటం, ఆపరేషన్లు: ఉగ్రవాద నిరోధక ఆపరేషన్లు, శాంతి స్థాపన ఆపరేషన్లు మొదలైనవి. దేశాంతర సహాయక చర్యలు: ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు సహాయక చర్యలు చేపట్టడం. ప్రత్యేక దళాలు: పారా కమాండోలు, మౌంటెన్ స్ట్రైకర్స్ వంటి ప్రత్యేక దళాలు కూడా పదాతి దళంలోనే ఉంటాయి.

### పదాతి దళం యొక్క ప్రత్యేకతలు:

విస్తృత శిక్షణ: పదాతి సైనికులు అన్ని రకాల పరిస్థితులలో యుద్ధం చేయడానికి శిక్షణ పొందుతారు. ఆధునిక ఆయుధాలు: వీరికి తుపాకులు, గ్రెనేడ్ లాంచర్లు, రాకెట్ లాంచర్లు వంటి ఆధునిక ఆయుధాలు అందుబాటులో ఉంటాయి. ధైర్యం మరియు నిబద్ధత: దేశం కోసం ఏదైనా చేయడానికి సిద్ధంగా ఉండే ధైర్యం మరియు నిబద్ధత వీరి ప్రత్యేకత.

**నిర్ధారణ:**భారత పదాతి దళం దేశం యొక్క గర్వం. వీరు తమ ప్రాణాలను పణంగా పెట్టి దేశాన్ని కాపాడుతున్నారు. వారికి మనం ఎల్లప్పుడూ కృతజ్ఞతలు తెలియజేయాల్సిన అవసరం అనివార్యంగా ఉంది.





రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# కమలం దీపాలతో కాక రేపిన రాజకీయాలు!

- ధనుష్ రాజకీయ ప్రవేశంపై మళ్లీ ఊహాగానాలు
- మహిళా అభిమానులకు కమలం గుర్తు ఉన్న వెండి దీపాల పంపిణీ
- అది తయారీదారుల ముద్రేనని స్పష్టం చేసిన అభిమాన సంఘం
- 'ఆపరేషన్ డి' పేరిట బీజేపీపై కాంగ్రెస్ తీవ్ర ఆరోపణలు
- పార్టీలోకి ధనుష్‌ను ఆహ్వానించిన అన్నాడీఎంకే



**చెన్నై, అక్టోబర్ 26 (సమయం న్యూస్):** తమిళ సినీ నటుడు ధనుష్ రాజకీయాల్లోకి వస్తారనే ప్రచారం మరోసారి తెరపైకి వచ్చింది. తన మహిళా అభిమానులకు ఆయన దీపావళి కానుకగా పంపిణీ చేసిన వెండి దీపాలపై కమలం ముద్ర ఉండటం ఈ తాజా చర్చకు కారణమైంది. అయితే ఆ గుర్తుకు రాజకీయాలతో సంబంధం లేదని ధనుష్ అభిమాన సంఘం స్పష్టం చేసింది. చెన్నైలోని తోరైపాక్కం సమీపంలో ఓ ప్రైవేట్ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ధనుష్ తన అభిమాన సంఘం మహిళా విభాగం సభ్యులను కలిశారు. సుమారు 3 వేల మంది హాజరైన ఈ కార్యక్రమంలో వారితో ఫొటోలు దిగారు. అనంతరం దీపావళి కానుకగా వెండి దీపాలను అందజేశారు. వాటిపై బీజేపీ ఎన్నికల గుర్తు కమలం ముద్ర కనిపించడంతో రాజకీయంగా పెద్ద చర్చ మొదలైంది. అయితే, అది దీపాల తయారీదారుకు సంబంధించిన ముద్ర మాత్రమేనని, దీనికి ఎలాంటి రాజకీయ ఉద్దేశం లేదని అభిమాన సంఘం ప్రతినిధి వెల్లడించారు.

### ఇది బీజేపీ 'ఆపరేషన్ డి'..

ధనుష్ రాజకీయ ప్రవేశంపై ఊహాగానాల నేపథ్యంలో వివిధ పార్టీల నేతలు స్పందిస్తున్నారు. తమిళనాడులో కొత్తగా రాజకీయాల్లోకి వస్తున్న సినీ ప్రముఖుల వెనుక ఢిల్లీ పెద్దల హస్తం ఉందని టీవీకే ఆరోపించింది. క్షేత్రస్థాయి పోరాటం ద్వారా విజయ్ రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని, ఆయనకు ధనుష్ ప్రత్యామ్నాయం కాలేరని వ్యాఖ్యానించింది. మరోవైపు, ఈ పరిణామాల వెనుక బీజేపీ, ఆర్ఎస్ఎస్ వ్యూహం ఉందని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బి.మాణికం ఠాగూర్ ఆరోపించారు. రాష్ట్రంలో రాజకీయ కల్లోలం సృష్టించేందుకు మరో సినీ నటుడిని ముందుకు తెస్తున్నారని విమర్శించారు. దీనిని 'ఆపరేషన్ డి' లేదా 'ప్లాన్ సి'గా ఆయన అభివర్ణించారు. గతంలో రజనీకాంత్ ద్వారా తమిళనాడులో పట్టు సాధించేందుకు బీజేపీ చేసిన ప్రయత్నాలు ఫలించలేదని, ఇప్పుడు మరో నటుడి ద్వారా తమ సిద్ధాంతాలను విస్తరించేందుకు కుట్ర చేస్తోందని ఆయన ఆరోపించారు.

### అన్నాడీఎంకే ఆహ్వానం..

రాజకీయాల్లోకి రావడం ఎవరి హక్కు అయినా అని డీఎంకే పేర్కొంది. విజయ్ రాజకీయాల్లోకి వచ్చినప్పుడు ధనుష్ ఎందుకు రాకూడదని ప్రశ్నించింది. మరోవైపు అన్నాడీఎంకే ఈ వ్యవహారంపై సానుకూలంగా స్పందించింది. యువతలో ధనుష్‌కు ఉన్న ఆదరణను ప్రస్తావిస్తూ.. అణగారిన వర్గాల సమస్యలను ప్రతిబింబించే పాత్రల్లో ఆయన నటించారని ప్రశంసించింది. ఎడప్పాడి పళనిస్వామి నాయకత్వంలో పనిచేసేందుకు ముందుకొస్తే పార్టీలోకి సగౌరవంగా ఆహ్వానిస్తామని తెలిపింది. ఈ పరిణామాలపై ధనుష్ మాత్రం ఇప్పటివరకు స్పందించలేదు. అభిమానులను కలిసే కార్యక్రమాలకే పరిమితమవుతూ రాజకీయ ప్రవేశంపై ఆయన ఎలాంటి ప్రకటన చేయలేదు.

# బాలీవుడ్ స్టార్స్‌పై బాంబే హైకోర్టు ఫైర్!

### కాలుష్య నివారణ ప్రచారానికి భారీ ఫీజులా?

### పారితోషికం అడగడంపై ధర్మాసనం తీవ్ర అసహనం

### ఉచితంగా రాకపోతే వాళ్ల వద్దకు వెళ్లాల్సిన పనేంటి?

### ఫ్రీగా చేసే మరాఠీ నటీనటులను సంప్రదించండి

**ముంబై, అక్టోబర్ 27 (సమయం న్యూస్):**
దీపావళి సమయంలో బాణసంచా కాల్చడం వల్ల తలెత్తే వాయు, శబ్ద కాలుష్యంపై అవగాహన కల్పించే ప్రచార కార్యక్రమాలకు సంబంధించి బాలీవుడ్ సెలబ్రిటీలు భారీగా పారితోషికం డిమాండ్ చేయడంపై బాంబే హైకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. సెలబ్రిటీలకు ఫీజులు చెల్లించడానికి ప్రజా ధనాన్ని వృథా చేయొద్దని అధికారులకు సూచించింది. నగరం నుంచి ఎంతో తీసుకునే నటులు సామాజిక బాధ్యతతో ఉచితంగానే ఇలాంటి ప్రచారాల్లో పాల్గొనాలని హితవు పలికింది.

### కనీసం 15 నిమిషాలు కేటాయించలేరా..

ముంబైలో పెరుగుతున్న వాయు కాలుష్యం, పండుగల వేళ బాణసంచా వినియోగంపై దాఖలైన ప్రజాప్రయోజన పిటిషన్‌పై సోమవారం నాడు ధర్మాసనం విచారణ చేపట్టింది. ఉచితంగా ప్రచారం చేయడానికి బాలీవుడ్ సెలబ్రిటీలు ముందుకు రాకపోతే, అలాంటి వారి వద్దకు వెళ్లాల్సిన అవసరమే లేదని తేల్చిచెప్పింది. ఏటా ముంబై పోలీసు డిపార్ట్‌మెంట్ నిర్వహించే 'ఉమంగ్' వంటి ఈవెంట్లలో పాల్గొనడానికి సమయం కేటాయించే ప్రముఖులు.. సామాజిక శ్రేయస్సు కోసం కనీసం 15 నిమిషాలు ఉచితంగా కేటాయించలేరా అని న్యాయస్థానం సూటిగా ప్రశ్నించింది. అవసరమైతే రూపాయి కూడా ఆశించకుండా సామాజిక కార్యక్రమాల్లో ఉచితంగా పాల్గొనే మరాఠీ నటీనటులను సంప్రదించాలని ధర్మాసనం సూచించింది.

# మహిళా క్రికెట్‌కు మరింత జోష్!

- జనవరి 14 నుంచి డబ్ల్యూపీఎల్ 2027
- ఫిబ్రవరి 7 వరకు ఐదో ఎడిషన్.. అక్టోబర్ 28న ఆటగాళ్ల వేలం
- జట్ల కూర్పుపై ఫ్రాంచైజీల దృష్టి.. రెండేసి టైటిళ్లతో ముంబై, బెంగళూరు




**న్యూఢిల్లీ:** మహిళా క్రికెట్‌కు ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పెరుగుతున్న నేపథ్యంలో మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) మరో సీజన్‌కు సిద్ధమవుతోంది. మహిళా క్రికెట్‌లో ప్రతిభావంతులైన ఆటగాళ్లకు వేదికగా నిలుస్తున్న ఈ లీగ్ ఐదో ఎడిషన్ 2027 జనవరి 14 నుంచి ఫిబ్రవరి 7 వరకు జరగనుంది. ఈ మేరకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) బుధవారం టోర్నీ షెడ్యూల్‌ను ప్రకటించింది. అయితే మ్యాచ్‌లు నిర్వహించే నగరాల వివరాలను మాత్రం వెల్లడించలేదు. సాధారణంగా మార్చి ఆరంభంలో జరిగే డబ్ల్యూపీఎల్‌ను ఈసారి ముందుగానే నిర్వహించనుండటం విశేషం. కొత్త సీజన్‌కు ముందు ఆటగాళ్ల వేలం నిర్వహణపై ఆసక్తి నెలకొంది. అక్టోబర్ 28న కేరళలోని కొచ్చిలో డబ్ల్యూపీఎల్ 2027 ఆటగాళ్ల వేలం జరగనుంది. ఇందులో పాల్గొనే ఐదు ఫ్రాంచైజీలు తమ జట్లలో అవసరమైన మార్పులు చేసుకుని, బలమైన జట్లను రూపొందించుకునేందుకు సిద్ధమవుతున్నాయి. ఆటగాళ్ల ప్రస్తుత ఫామ్, గత సీజన్లలో వారి ప్రదర్శనలు, జట్టుకు అవసరమైన పాత్రలను పరిగణనలోకి తీసుకుని వేలంలో ఎంపికలు చేపట్టనున్నాయి. దీంతో ఏ ఆటగాడికి ఏ జట్టు అవకాశం కల్పిస్తుంది? స్టార్ క్రికెటర్ల కోసం ఫ్రాంచైజీలు ఎంతవరకు ఆసక్తి చూపిస్తాయి? అనే అంశాలు చర్చనీయాంశంగా మారనున్నాయి. ప్రస్తుత జట్లలోని ఆటగాళ్లను కొనసాగించుకునేందుకు బీసీసీఐ సెప్టెంబర్ 28ను చివరి తేదీగా నిర్ణయించింది. ఈ గడువు నేపథ్యంలో ఐదు ఫ్రాంచైజీలు తమ జట్ల కూర్పుపై దృష్టి సారించనున్నాయి. గత సీజన్‌లో మెరుగైన ప్రదర్శన చేసిన ఆటగాళ్లను కొనసాగించుకోవడంతో పాటు, జట్టులోని బలహీనతలను అధిగమించేందుకు అవసరమైన మార్పులు చేపట్టడం కీలకం కానుంది. రిటెన్షన్ల ప్రక్రియ పూర్తయిన తర్వాత వేలంలో ఆటగాళ్ల ఎంపిక ద్వారా జట్ల తుది కూర్పు మరింత స్పష్టతకు రానుంది. కొత్త సీజన్‌లో టైటిల్ లక్ష్యంగా బరిలోకి దిగే ఫ్రాంచైజీలకు ఈ ప్రక్రియ కీలకంగా మారనుంది. 2023లో ప్రారంభమైన మహిళల ప్రీమియర్ లీగ్ తక్కువ సమయంలోనే ప్రపంచ క్రికెట్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. భారత్‌తో పాటు వివిధ దేశాలకు చెందిన ప్రముఖ క్రికెటర్లు ఈ టోర్నీలో పాల్గొంటున్నారు. అంతర్జాతీయ స్థాయిలో తమ ప్రతిభను చాటుకునేందుకు యువ క్రీడాకారిణులకు కూడా ఈ లీగ్ అవకాశాలు కల్పిస్తోంది. వివిధ దేశాల ఆటగాళ్లు ఒకే జట్టులో కలిసి ఆడటం ద్వారా అనుభవాన్ని పంచుకోవడంతో పాటు ఆటలో కొత్త నైపుణ్యాలను నేర్చుకునే అవకాశం లభిస్తోంది. మహిళా క్రికెట్‌పై అభిమానుల్లో ఆసక్తిని పెంచడం, ఆటగాళ్లకు మెరుగైన పోటీ వాతావరణాన్ని కల్పించడం వంటి అంశాల్లో డబ్ల్యూపీఎల్ కీలక పాత్ర పోషిస్తోంది. డబ్ల్యూపీఎల్ ఇప్పటివరకు నిర్వహించిన నాలుగు ఎడిషన్లలో ముంబై ఇండియన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్లు రెండేసి టైటిళ్లు సాధించాయి. 2026 సీజన్‌లో స్మృతి మంధాన నాయకత్వంలోని ఆర్సీబీ రెండోసారి చాంపియన్‌గా నిలిచింది. గత సీజన్ మ్యాచ్‌లను నవీ ముంబై, బరోడాలో నిర్వహించారు. ఈ రెండు జట్లు ఇప్పటికే తమ సత్తా చాటగా, మిగిలిన ఫ్రాంచైజీలు కూడా టైటిల్ పోటీలో ముందంజ వేయాలని భావిస్తున్నాయి. కొత్త సీజన్‌కు ముందు ఆటగాళ్ల వేలం, జట్ల కూర్పులు పోటీ స్వరూపాన్ని ప్రభావితం చేయనున్నాయి. సాధారణంగా మార్చి ఆరంభంలో జరిగే డబ్ల్యూపీఎల్ ఈసారి జనవరి మధ్యలోనే ప్రారంభం కానుంది. జనవరి 14 నుంచి ఫిబ్రవరి 7 వరకు సాగే టోర్నీలో ఐదు జట్లు టైటిల్ కోసం పోటీపడనున్నాయి. మ్యాచ్‌ల వేదికలపై బీసీసీఐ నుంచి మరింత స్పష్టత రావాల్సి ఉంది. ఆటగాళ్ల వేలం పూర్తయి జట్ల కూర్పులు ఖరారైన తర్వాత కొత్త సీజన్‌పై అంచనాలు మరింత పెరిగే అవకాశం ఉంది. డిఫెండింగ్ చాంపియన్ ఆర్సీబీ టైటిల్‌ను నిలబెట్టుకుంటుందా? ముంబై ఇండియన్స్ మరోసారి ఆధిపత్యం చాటుతుందా? లేక మరో జట్టు విజేతగా అవతరిస్తుందా? అన్నది 2027 సీజన్‌లో తేలనుంది.



# ఏఐటీఏ ఎన్నికల్లోకి సానియా, భూపతి

## లియాండర్ పేస్ అధ్యక్ష ఆశలకు గండి!

### ఎస్ఓఎం ప్రతినిధుల ఎన్నిక కోసం నామినేషన్లు దాఖలు చేసిన సానియా, మహేశ్ భూపతి

**న్యూఢిల్లీ:** భారత టెన్నిస్ వర్గాల్లో అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. దేశ టెన్నిస్ క్రీడా రంగంలో సరికొత్త చరిత్ర సృష్టించిన దిగ్గజ క్రీడాకారులు సానియా మీర్జా, మహేశ్ భూపతి అఖిల భారత టెన్నిస్ సంఘం పరిపాలనలోకి అడుగుపెట్టేందుకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా వారు ఏఐటీఏలో 'స్పోర్ట్స్ పర్సన్ ఆఫ్ అవుట్‌స్టాండింగ్ మెరిట్' ప్రతినిధుల ఎన్నిక కోసం నామినేషన్లు దాఖలు చేశారు. మరోవైపు, ఏఐటీఏ అధ్యక్ష పదవిని ఆశించిన మరో లెజెండరీ టెన్నిస్ ఆటగాడు లియాండర్ పేస్ అనూహ్యంగా ఈ రేసు నుంచి వెనుకంజ వేయాల్సి వచ్చింది. ఏఐటీఏ సవరించిన నిబంధనల ప్రకారం.. అధ్యక్ష పదవికి పోటీ చేయాలంటే అభ్యర్థి కచ్చితంగా ఎస్ఓఎం ప్రతినిధిగా ఎన్నికై ఉండాలి లేదా గతంలో కార్యవర్గంలో పనిచేసిన అనుభవం ఉండాలి. ఈ రెండు అర్హతలు లేని లియాండర్ పేస్‌కు ఎస్ఓఎం ఎన్నికల ద్వారా అర్హత సాధించడం ఒక్కటే మార్గం. అయితే, ఆయన ఎస్ఓఎం ఎన్నికలకు నామినేషన్ దాఖలు చేయకపోవడంతో అధ్యక్ష పదవికి పోటీ చేసే అవకాశాన్ని కోల్పోయారు. గతంలో బెంగాల్ టెన్నిస్ సంఘం పేస్‌ను అధ్యక్ష అభ్యర్థిగా బలపరిచినప్పటికీ, ఈ నిబంధనల పేచీ కారణంగా ఆయన ఆశలకు గండిపడింది.

**బరిలో ప్రముఖ మాజీ ఆటగాళ్లు:**

ఎస్ఓఎం ప్రతినిధుల ఎన్నికల కోసం సానియా మీర్జా, మహేశ్ భూపతితో పాటు అంకితా భాంబ్రి, ప్రస్తుత డేవిస్ కప్ కోచ్ ఆశుతోష్ సింగ్, విశాల్ ఉప్పల్, గౌరవ్ నాటేకర్, జాన్సీ కృష్ణమూర్తి, శాలిని ఠాకుర చావల సహా మొత్తం 8 మంది మాజీ క్రీడాకారులు నామినేషన్లు దాఖలు చేశారు. క్రీడా సమాఖ్యల నిర్వహణలో అత్యున్నత స్థాయిలో రాణించిన మాజీ ఆటగాళ్లకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాలనే ఉద్దేశంతో ఈ ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఈ నిబంధనల ప్రకారం నలుగురు ఎస్ఓఎం ప్రతినిధులను జనరల్ బాడీకి, ఇద్దరిని ఎగ్జిక్యూటివ్ కమిటీకి ఎన్నుకోనున్నారు. ఈ పరిణామంపై స్పందించిన మహేశ్ భూపతి.. ప్రతి క్రీడా సమాఖ్యకు ఉన్నత స్థాయిలో ఆడిన ఆటగాళ్ల సేవలు ఎంతో అవసరమని తెలిపారు. బ్యాడ్మింటన్‌లో పులేల గోపీచంద్ తీసుకువచ్చిన మార్పులే దీనికి చక్కటి ఉదాహరణ అని ఆయన పేర్కొన్నారు. కాగా, నవంబర్ 7న ఎస్ఓఎం ఎన్నికలు జరగనుండగా, నవంబర్ 27న ఏఐటీఏ ప్రధాన ఎన్నికలు నిర్వహించనున్నారు.

# టీ20 క్రికెట్ చరిత్రలోనే సరికొత్త రికార్డు

- తొలి జట్టుగా టీమిండియా!
- అంతర్జాతీయ టీ20ల్లో 200 విజయాలు సాధించిన మొదటి టీమ్‌గా భారత్ రికార్డు
- న్యూజిలాండ్‌పై విజయంలో మెరిసిన తెలుగు ఆణిముత్యాలు తిలక్ వర్మ, నితీశ్ కుమార్ రెడ్డి




**క్రైస్ట్‌చర్చ్, అక్టోబర్ 26: అంతర్జాతీయ** టీ20 క్రికెట్‌లో భారత్ మరో అపూర్వమైన ఘనతను తన ఖాతాలో వేసుకుంది. అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో 200 విజయాలు సాధించిన తొలి జట్టుగా టీమిండియా చరిత్ర సృష్టించింది. న్యూజిలాండ్‌తో శనివారం జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో అద్భుత విజయం సాధించడం ద్వారా భారత్ ఈ మైలురాయిని అందుకుంది. కాగా, భారత్‌కు ఇది 300వ అంతర్జాతీయ టీ20 మ్యాచ్ కావడం విశేషం. టీమిండియా ఇప్పటివరకు ఆడిన 300 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లలో 200 విజయాలు సాధించగా, 83 మ్యాచ్‌లలో ఓటమి పాలైంది. మరో ఏడు మ్యాచ్‌లు టైగా ముగియగా, 10 మ్యాచ్‌లలో ఎలాంటి ఫలితం తేలలేదు. దీంతో అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో 200 విజయాల మైలురాయిని అందుకున్న ప్రపంచంలోని తొలి జట్టుగా భారత్ అగ్రస్థానంలో నిలిచింది. ఈ రికార్డు జాబితాలో పాకిస్థాన్ 176 విజయాలతో రెండో స్థానంలో కొనసాగుతుండగా, న్యూజిలాండ్ 135, దక్షిణాఫ్రికా 129, ఇంగ్లండ్ 128, ఆస్ట్రేలియా 127 విజయాలతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ప్రస్తుత టీమిండియా ఫామ్ చూస్తుంటే ఈ విజయాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

**తెలుగు ఆటగాళ్ల అసాధారణ పోరాటం**

న్యూజిలాండ్‌తో జరిగిన రెండో టీ20లో భారత్ నాలుగు వికెట్ల తేడాతో అద్భుత విజయాన్ని అందుకుంది. మ్యాచ్‌లో భాగంగా 181 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియా, ఒక దశలో కేవలం 70 పరుగులకే ఐదు కీలక వికెట్లు కోల్పోయి తీవ్ర ఇబ్బందుల్లో పడింది. మ్యాచ్ కివీస్ వశమవుతుందని భావిస్తున్న తరుణంలో, తెలుగు ప్లేయర్స్ తిలక్ వర్మ, నితీశ్ కుమార్ రెడ్డి అసాధారణ బ్యాటింగ్‌తో చెలరేగిపోయి జట్టును విజయతీరాలకు చేర్చారు. యువ ఆటగాడు తిలక్ వర్మ కేవలం 26 బంతుల్లోనే 51 పరుగులు చేసి అజేయంగా నిలవగా, ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి కేవలం 13 బంతుల్లోనే 26 పరుగులు చేసి మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. ఈ ఇద్దరూ కలిసి ఏడో వికెట్‌కు అజేయమైన భాగస్వామ్యాన్ని నెలకొల్పి మ్యాచ్ స్వరూపాన్ని పూర్తిగా మార్చేశారు. చివరి వరకు పట్టువదలక పోరాడిన భారత జట్టు 19.5 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 181 పరుగులు సాధించి చిరస్మరణీయ విజయాన్ని సొంతం చేసుకుంది.

# నాలుగేళ్ల తర్వాత రీఎంట్రీ

### తడబడుతున్న భువీకి బౌలింగ్ కోచ్ మోర్కెల్ విలువైన సూచనలు!

### భువనేశ్వర్‌కు మోర్కెల్ అండ : బయటి విమర్శలు పట్టించుకోవద్దని సూచన



**వెల్లింగ్టన్, అక్టోబర్ 26:** న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్‌లో భారత సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్ తడబడుతున్నా.. బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ అతడికి అండగా నిలిచాడు. బయటి నుంచి వచ్చే విమర్శలు, అంచనాల గురించి ఆలోచించకుండా తన సహజశైలిలో బౌలింగ్ చేయాలని సూచించాడు. ఒక్కో మ్యాచ్‌తో లయ అందుకుంటాడని ధీమా వ్యక్తం చేశాడు. నాలుగేళ్ల విరామం తర్వాత భారత టీ20 జట్టులోకి తిరిగొచ్చిన భువనేశ్వర్‌కు ఆరంభం ఆశించిన స్థాయిలో సాగలేదు. న్యూజిలాండ్‌తో తొలి రెండు టీ20ల్లో తన కోటా ఓవర్లలో వరుసగా 49, 50 పరుగులు సమర్పించుకున్నాడు. 12.37 ఎకానమీతో భారత బౌలర్లలో అత్యధిక పరుగులు ఇచ్చిన బౌలర్‌గా నిలిచాడు. మంగళవారం జరగనున్న మూడో టీ20కి ముందు మోర్కెల్ మీడియాతో మాట్లాడాడు. నాలుగేళ్ల తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌లోకి తిరిగొచ్చిన ఆటగాడిపై అంచనాలు ఎక్కువగా ఉంటాయని, వాటిని పక్కన పెట్టాలని భువనేశ్వర్‌కు చెప్పినట్లు వెల్లడించాడు. ఐపీఎల్‌లో అతడు అద్భుతంగా రాణించాడని, అయితే అంతర్జాతీయ క్రికెట్ పూర్తిగా భిన్నమని పేర్కొన్నాడు. జాతీయ జట్టులోకి ఎంపికయ్యే ముందు భువనేశ్వర్‌కు సాధన చేసేందుకు నెల రోజుల సమయం మాత్రమే లభించిందని మోర్కెల్ వివరించాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో చిన్న పొరపాట్లకూ భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని చెప్పాడు. అతడి నైపుణ్యం, అనుభవంపై తనకు నమ్మకం ఉందన్నాడు. కొన్ని మ్యాచ్‌ల్లో స్థిరపడేందుకు సమయం ఇవ్వాలని సూచించాడు. గత రెండు ఐపీఎల్ సీజన్లలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరఫున భువనేశ్వర్ 45 వికెట్లు పడగొట్టాడు. ఆ జట్టు టైటిల్ విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. కొత్త బంతితో అతడి బౌలింగ్, అనుభవం జాతీయ జట్టులోకి తిరిగి వచ్చేలా చేశాయి. ఐదు టీ20ల సిరీస్‌లో భారత్ 2-0తో ఆధిక్యంలో ఉంది. మూడో మ్యాచ్‌కు వెల్లింగ్టన్‌లో వీచే బలమైన గాలులు సవాల్‌గా మారనున్నాయని మోర్కెల్ అన్నాడు. పరిస్థితులను సాకుగా చూపకుండా, సవాలును ఎదుర్కొనేందుకు జట్టు సిద్ధంగా ఉందని స్పష్టం చేశాడు.

# ఒక్క పరుగు తేడాతో డబుల్ సెంచరీ మిస్..

## అంపైర్ వివాదాస్పద నిర్ణయానికి దేవదత్ పడిక్కల్ బలి!

**లింకన్, అక్టోబర్ 26:** న్యూజిలాండ్‌లోని లింకన్ వేదికగా భారత్ 'ఏ', న్యూజిలాండ్ 'ఏ' జట్ల మధ్య జరుగుతున్న తొలి అనధికారిక టెస్టు మ్యాచ్‌లో దేవదత్ పడిక్కల్ మారథాన్ ఇన్నింగ్స్ ఆడాడు. అయితే, కేవలం ఒక్క పరుగు తేడాతో (199 పరుగుల వద్ద) తృటిలో డబుల్ సెంచరీని చేజార్చుకున్నాడు. అతను ఔటైన తీరు మైదానంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఫీల్డ్ అంపైర్ ఇచ్చిన వివాదాస్పద కాట్ బిహైండ్ నిర్ణయంపై పడిక్కల్ ఆశ్చర్యం, అసంతృప్తి వ్యక్తం చేశాడు. న్యూజిలాండ్ 'ఏ' ఆటగాళ్లు చేసిన అప్పీల్‌లో పెద్దగా బలం లేనప్పటికీ, అంపైర్ వేలు పైకెత్తడం అందరినీ విస్మయానికి గురిచేసింది. ఇన్నింగ్స్ 78వ ఓవర్‌లో కివీస్ బౌలర్ జాక్ గిబ్సన్ వేసిన లెగ్ సైడ్ సాధారణ లెంగ్త్ డెలివరీని ఎడమచేతి వాటం బ్యాటర్ అయిన పడిక్కల్ ఫ్లిక్ చేయడానికి ప్రయత్నించాడు. ఆ సమయంలో బంతి బ్యాట్‌కు కాకుండా ప్యాడ్‌ను తాకుతూ వెళ్లి వికెట్ కీపర్ మిచెల్ హే గ్లోవ్స్‌లో పడింది. క్రికెట్ నిబంధనల ప్రకారం బంతి బ్యాట్‌ను తాకకుండా కేవలం ప్యాడ్‌ను తాకి వికెట్ కీపర్ వద్దకు వెళితే అది నాటౌట్. ఆ సమయంలో బంతి ప్యాడ్‌కే తగిలిందని పడిక్కల్ గట్టిగా భావించాడు. కానీ అంపైర్ మాత్రం బంతి బ్యాట్‌కు తగిలిందని భావిస్తూ ఔట్‌గా ప్రకటించాడు. అంపైర్ నిర్ణయంతో షాకైన పడిక్కల్.. బంతి బ్యాట్‌కు ఎంత దూరంలో ఉందో, ప్యాడ్‌కు ఎలా తగిలిందో తన హావభావాల ద్వారా అంపైర్‌కు వివరించే ప్రయత్నం చేశాడు. కానీ ఫలితం లేకపోవడంతో నిరాశతో మైదానాన్ని వీడాడు.

**అసలేం జరిగిందంటే..**

దురదృష్టవశాత్తూ పడిక్కల్ డబుల్ సెంచరీ మిస్ అయినప్పటికీ, అతను ఆడిన ఇన్నింగ్స్ చరిత్రలో నిలిచిపోయింది. కేవలం 248 బంతుల్లో 24 ఫోర్లు, 3 భారీ సిక్సర్లతో ఏకంగా 199 పరుగులు బాదాడు. దీంతో ఇండియా 'ఏ' చరిత్రలోనే ఒక ఇన్నింగ్స్‌లో అత్యధిక వ్యక్తిగత పరుగులు సాధించిన బ్యాటర్‌గా పడిక్కల్ సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఇండియా 'ఏ' తరఫున పడిక్కల్‌కు ఇది మూడో సెంచరీ కాగా, ఈ ఇన్నింగ్స్ ద్వారానే భారత్ 'ఏ' తరఫున 1000 పరుగుల మైలురాయిని కూడా విజయవంతంగా అధిగమించాడు. మొదటి ఇన్నింగ్స్‌లో భారత్ 113 పరుగులకే కుప్పకూలగా, న్యూజిలాండ్ 317 పరుగులు చేసి 204 పరుగుల భారీ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యాన్ని అందుకుంది. ఆ తర్వాత రెండో ఇన్నింగ్స్‌లోనూ 10 పరుగులకే యశస్వి జైస్వాల్ (5), కేఎల్ రాహుల్ (4)ల వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడిన దశలో పడిక్కల్, సాయి సుదర్శన్ జట్టును ఆదుకున్నారు. మూడో వికెట్‌కు 215 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని జోడించారు. సాయి సుదర్శన్ 91 పరుగులు చేయగా.. ఆ తర్వాత యశ్ రాథోడ్ (66), వాషింగ్టన్ సుందర్ (నాటౌట్ 51) అర్ధ శతకాలతో రాణించారు. దీంతో మూడో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 8 వికెట్లకు 488 పరుగుల భారీ స్కోరు సాధించి.. మ్యాచ్‌లో 284 పరుగుల ఆధిక్యంలో నిలిచింది.






# జైలర్-2.. తెలుగులోనే 100 కోట్లు!

బాక్సాఫీస్ దగ్గర 'తలైవా' సునామీ సృష్టిస్తున్నారు. వయసుతో పనేలేదని, వెండితెరపై తన మేనియా ఎప్పటికీ తగ్గదని నిరూపిస్తూ సూపర్ స్టార్ రజనీకాంత్ మరోసారి తన విశ్వరూపం చూపించారు. ఆయన నటించిన లేటెస్ట్ సెన్సేషన్ 'జైలర్ 2' బాక్సాఫీస్‌ను షేక్ చేస్తూ సరికొత్త హిస్టరీ క్రియేట్ చేసింది. ముఖ్యంగా తెలుగు వెర్షన్‌లో ఈ సినిమా కలెక్షన్ల వర్షం కురిపిస్తూ ప్రపంచవ్యాప్తంగా ఏకంగా రూ.100 కోట్ల గ్రాస్ మార్కును దాటేసి సరికొత్త సంచలనానికి తెరతీసింది. ఒక తమిళ హీరో సినిమా డబ్బింగ్ వెర్షన్ తెలుగు రాష్ట్రాలతో పాటు ఓవర్సీస్‌లోనూ ఈ స్థాయిలో విధ్వంసం సృష్టించడం ట్రేడ్ పండితులనే ఆశ్చర్యపరుస్తోంది. చాలామంది డబ్బింగ్ హీరోల సినిమాలు వస్తుంటాయి పోతుంటాయి.. కానీ రజనీకాంత్ వస్తే ఆ వైబ్రేషనే వేరు. తెలుగు ఆడియన్స్ ఆయన్ను ఎంతగా సొంతం చేసుకున్నారో 'జైలర్ 2' వసూళ్లు మరోసారి కళ్లకు కట్టాయి. మొదటి రోజే వచ్చిన పాజిటివ్ టాక్‌తో థియేటర్లన్నీ హౌస్‌ఫుల్ బోర్డులతో దద్దరిల్లిపోయాయి. ఈ వంద కోట్ల మార్క్‌తో రజనీకాంత్ సౌత్ ఇండియాలోనే అరుదైన మైలురాయిని చేరుకున్నారు. కేవలం తెలుగు వెర్షన్ ద్వారానే నాలుగు సార్లు రూ.100 కోట్ల గ్రాస్ క్లబ్‌లోకి అడుగుపెట్టిన ఏకైక తమిళ హీరోగా రికార్డులకెక్కారు. ఇతర భాషా స్టార్లకు తెలుగులో ఒకట్రెండు సినిమాలు ఆడటం చూశాం.. కానీ నాలుగు సార్లు సెంచరీ కొట్టడం ఒక్క రజనీకాంత్‌కే చెల్లిందని ట్రేడ్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. స్క్రీన్‌పై రజనీ స్వాగ్, నెల్సన్ స్టైలిష్ మాస్ టేకింగ్, థియేటర్లలో ఈలలు వేయించే యాక్షన్ సీన్స్ తెలుగు ప్రేక్షకులకు పూనకాలు తెప్పించాయి. బాక్సాఫీస్ దగ్గర రజనీ ర్యాంపేజ్ ఇంకా కొనసాగుతుండటంతో ఫుల్ రన్‌లో 'జైలర్ 2' మరిన్ని పాత రికార్డులను బద్దలు కొట్టడం ఖాయంగా కనిపిస్తోందని అంటున్నారు.

## మా వ్యక్తిగత జీవితంపై అనవసర వ్యాఖ్యలు చేయొద్దు: రష్మిక

విజయ్ దేవరకొండతో తన వైవాహిక బంధంపై సామాజిక మాధ్యమాల్లో వస్తున్న విమర్శలకు నటి రష్మిక స్పందించారు. తమ వ్యక్తిగత జీవితంపై పూర్తి వివరాలు తెలుసుకోకుండా ఊహాగానాలు చేయొద్దని, ఎడిట్ చేసిన వీడియోలు, అసంపూర్ణ సమాచారంతో తీర్పులు ఇవ్వడం సరికాదని స్పష్టం చేశారు. ఇటీవల 'కాఫీ విత్ కరణ్' కార్యక్రమంలో పాల్గొన్న విజయ్.. రష్మిక తనను పెళ్లి చేసుకోమని వందసార్లు అడిగిందని సరదాగా వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై విజయ్‌ను విమర్శిస్తూ నెట్టింట పోస్టులు రావడంతో రష్మిక ఇన్‌స్టాగ్రామ్ వేదికగా స్పందించారు. పెళ్లి విషయంలో నిర్ణయం తీసుకోవడానికి విజయ్ సమయం తీసుకోవడంలో తప్పేమీ లేదని పేర్కొన్నారు. ఒకరినొకరు అర్థం చేసుకుని, జీవితంలోని కష్టసుఖాలను కలిసి ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామో తెలుసుకోవడం ముఖ్యమని రష్మిక అన్నారు. విజయ్‌పై తనకు ఎంతో ప్రేమ ఉందని, ఇద్దరూ పరస్పర అంగీకారంతో ఒకరినొకరు జీవిత భాగస్వాములుగా ఎంచుకున్నామని తెలిపారు. తాను కష్టాల్లో ఉన్నప్పుడు విజయ్ అండగా నిలిచారని, ఇప్పటికీ ఆ మద్దతు కొనసాగుతోందని వెల్లడించారు. ప్రస్తుతం తన జీవితంలో ఎంతో సంతోషంగా ఉన్నానని పేర్కొంటూ, తమ కుటుంబం గురించి తెలియకుండా ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేయడం వేధింపులతో సమానమని ఆవేదన వ్యక్తం చేశారు. పదేళ్లుగా తనను ఆదరిస్తున్న అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు.





# అజిత్ హీరోయిన్‌గా కయాదు లోహార్?

తమిళ స్టార్ హీరో అజిత్ అభిమానులకు గుడ్‌న్యూస్. ఆయన నటించనున్న 64వ చిత్రానికి 'డేర్ డెవిల్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. నవంబర్ 2 నుంచి షూటింగ్ ప్రారంభం కానున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. దీంతో ఈ ప్రాజెక్టుపై అభిమానుల్లో ఆసక్తి పెరిగింది. 'గుడ్ బ్యాడ్ అగ్లీ' తర్వాత అజిత్ మరోసారి దర్శకుడు అధిక్ రవిచంద్రన్‌తో కలిసి పనిచేయనున్నారు. నిర్మాతల విషయంలో నెలకొన్న సందిగ్ధత, అజిత్ కార్ రేసింగ్ కార్యక్రమాల కారణంగా ఈ సినిమా ఆలస్యమైంది. ఈ చిత్రానికి అజిత్ స్వయంగా నిర్మాతగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. మొదట హీరోయిన్‌గా శ్రీలీల పేరు వినిపించినప్పటికీ, ఆమె ఈ ప్రాజెక్టు నుంచి తప్పుకున్నట్లు ప్రచారం జరిగింది. తాజాగా ఆమె స్థానంలో కయాదు లోహార్ నటించనున్నట్లు కోలీవుడ్‌లో వార్తలు వస్తున్నాయి. అయితే చిత్ర బృందం దీనిపై అధికారికంగా స్పందించలేదు. మరోవైపు అధిక్ రవిచంద్రన్ తన సినిమాల్లో హీరోయిన్ పాత్రకు 'రమ్య' అనే పేరు పెట్టడం ప్రత్యేకతగా కొనసాగుతోంది. 'డేర్ డెవిల్'లోనూ ఇదే సంప్రదాయాన్ని కొనసాగిస్తారా? కయాదు లోహార్ హీరోయిన్‌గా ఖరారవుతారా? అన్నది అధికారిక ప్రకటన తర్వాతే స్పష్టత రానుంది.



# రవిబాబు హారర్ సినిమాలో బాలీవుడ్ క్వీన్ కంగనా రనౌత్!

టాలీవుడ్‌లో ఓ క్రేజీ కాంబినేషన్ తెరపైకి వచ్చింది. వైవిధ్యమైన కథలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు రవిబాబు.. ఓ హారర్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారనే ప్రచారం జరుగుతోంది. ఈ సినిమాలో బాలీవుడ్ ఫైర్‌బ్రాండ్ కంగనా రనౌత్ ప్రధాన పాత్రలో నటిస్తున్నారనే వార్త ఇప్పుడు సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. అదే నిజమైతే దాదాపు 17 ఏళ్ల తర్వాత కంగనా మళ్లీ తెలుగు తెరపై కనిపించనున్నట్టే! విభిన్నమైన కథాంశాలు, విలక్షణమైన మేకింగ్‌తో ప్రేక్షకుల్లో ఆసక్తి రేకెత్తించడం దర్శకుడు రవిబాబు శైలి. ఇటీవల 'రేజర్'తో వార్తల్లో నిలిచిన ఆయన.. ఇప్పుడు హారర్ జానర్‌లో మరో ప్రయోగానికి సిద్ధమవుతున్నారనే టాక్ వినిపిస్తోంది. ఈ ప్రాజెక్టులో కంగనా రనౌత్ నటించనున్నారనే ప్రచారం ఈ సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోంది. ఈ చిత్రానికి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు పూర్తయ్యాయని, చిత్రీకరణ కూడా రహస్యంగా సాగుతోందని కొన్ని కథనాలు పేర్కొంటున్నాయి. అయితే ఈ వార్తల్లో నిజమెంత? కంగనా నిజంగానే రవిబాబు సినిమాలో నటిస్తున్నారా? అనే ప్రశ్నలకు ఇప్పటివరకు అధికారిక సమాధానం లేదు. కంగనా రనౌత్‌కు తెలుగు ప్రేక్షకులతో గతంలోనే పరిచయం ఉంది. ప్రభాస్ కథానాయకుడిగా, పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో తెరకెక్కిన 'ఏక్ నిరంజన్'లో ఆమె కథానాయికగా నటించారు. ఆ సినిమా ద్వారా తెలుగు తెరకు పరిచయమైన కంగనా.. ఆ తర్వాత మరో తెలుగు చిత్రంలో కనిపించలేదు. ఇప్పుడు రవిబాబు హారర్ సినిమాలో ఆమె నటిస్తున్నారనే ప్రచారం నిజమైతే, దాదాపు 17 ఏళ్ల విరామం తర్వాత టాలీవుడ్‌లోకి ఆమె రీఎంట్రీ ఇచ్చినట్లవుతుంది. బాలీవుడ్‌లో తనదైన నటనతో గుర్తింపు సంపాదించిన కంగనా.. హారర్ కథలో ఎలాంటి పాత్రలో కనిపిస్తారనే అంశం ఆసక్తికరంగా మారుతుంది. కంగనా రనౌత్ తదుపరి చిత్రాల గురించి ఇప్పటికే పలు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆమె ఓ తెలుగు సినిమాలో నటించనున్నారనే ప్రచారం అభిమానుల్లో చర్చకు దారితీసింది. అయితే రవిబాబు దర్శకత్వంలో తెరకెక్కనున్నట్లు చెబుతున్న హారర్ చిత్రానికి సంబంధించి కంగనా ఎంపిక, కథ, పాత్ర, షూటింగ్ వివరాలపై అధికారిక సమాచారం అందుబాటులో లేదు. ఓవైపు విలక్షణ దర్శకుడు రవిబాబు.. మరోవైపు బాలీవుడ్ క్వీన్ కంగనా రనౌత్.. ఈ ఇద్దరి కలయిక నిజమైతే సినిమాపై సహజంగానే భారీ ఆసక్తి ఏర్పడుతుంది. కానీ ప్రస్తుతం ఈ కాంబినేషన్‌పై వస్తున్న వార్తలకు అధికారిక ధ్రువీకరణ లేదు. కంగనా బృందం లేదా చిత్రబృందం నుంచి ప్రకటన వెలువడితేనే ఈ ప్రాజెక్టుపై స్పష్టత రానుంది. అప్పటివరకు ఈ క్రేజీ కాంబినేషన్‌ను ఆసక్తికరమైన ప్రచారంగానే చూడాలి.

Printed, Published by **Mohammed Murthuza.** Printed at NUTAN OFFSET PRINTERS, R.S.NO. 434, PLOT NO 16,17, AUTO NAGAR, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520007. Ediotr: **MOHAMMED MURTHUZA,** PRGI No:APTEL/26/A3949, www.samayam.net Mobile No. **7036644111, 9490140565**